విలేకరులు కావలెను
తెలంగాణ వాణి
తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలు, నియోజకవర్గాలు, మండలాల వారిగా విలేకర్లు కావలెను.
పాలిటిక్స్, ప్రజాసమస్యలు, అక్రమాలపై వార్త రాసే పట్టు కలిగిన వారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వబడును
9703247143

TELANGANA VANI TELUGU DAILY
R N I No. APTEL/2012/53127

# తెలంగాణ వాణి

తెలుగు దినపత్రిక

తెలంగాణ వాణి TV
THE VOICE OF TELANGANA
ఎడిటర్ జేరిపోతుల సంపత్
9912758107

సంపుటి: 16 | సంచిక : 143 | శుక్రవారం 25. 9. 2026 | ఎడిటర్: జేరిపోతుల సంపత్ | కరీంనగర్ | పేజీలు 8 | వెల: 5.00

## దానం నాగేందర్‌పై సుప్రీం తీర్పు రాజ్యాంగ విజయం: ఏలేటి మహేశ్వర్‌రెడ్డి



హైదరాబాద్: దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు సమర్థించడం రాజ్యాంగ విజయమని భాజపా శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. భాజపా చేసిన న్యాయపోరాటం వల్లే ఈ విజయం దక్కిందని చెప్పారు. ఇదే స్ఫూర్తితో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న రాజ్యాంగ వ్యతిరేక చర్యలపై కోర్టులు, క్షేత్రస్థాయిలో పోరాటాలు కొనసాగిస్తామన్నారు. ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని అమలు చేయాల్సిన సీఎం రేవంత్ రెడ్డి.. స్వయంగా ఫిరాయింపులను ప్రోత్సహించడం కంచే చేను మేసిన వైనాన్ని తలపించిందని విమర్శించారు. ఇకనైనా పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలతో రాజీనామాలు చేయించి ఉపఎన్నికకు వెళ్లాలన్నారు.

## సీఈసీ రాజీనామా చేయకుంటే 'జంతర్ మంతర్ 2.0' - సీజేపీ

హైదరాబాద్:(తెలంగాణ వాణి)

సంఘం ప్రత్యేక సమగ్ర సవరణ అంశంపై కాక్రోచ్ జనతా పార్టీ తీవ్ర స్థాయిలో స్పందించింది. ప్రధాన ఎన్నికల కమిషనరు (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ 48 గంటల్లో రాజీనామా చేయాలని డిమాండ్ చేసింది. లేదంటే జంతర్ మంతర్ వద్ద మరోసారి నిరసన కార్యక్రమాన్ని చేపడతామని హెచ్చరించింది. సర్‌పై జాతీయ మీడియాలో వచ్చిన కథనాలతో దుమారం చెలరేగిన నేపథ్యంలో దిల్లీలో మీడియా సమావేశం ఏర్పాటు చేసిన సీజేపీ ప్రతినిధులు.. త్వరలో జరగబోయే అన్ని రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలనూ నిలిపివేయాలని డిమాండ్ చేశారు. "రెండు రోజుల్లోగా సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయకుంటే దేశ వ్యాప్తంగా నిరసనలు చేపడతాం. అనంతరం దిల్లీలో జంతర్ మంతర్ 2.0 తప్పకుండా చేపట్టి తీరుతాం. ఎన్నికల్లో



అవకతవకలు జరిగాయని భావిస్తే విపక్షాలు ఎన్నికల ప్రక్రియలో పాల్గొనవద్దు. ప్రజాస్వామ్యానికి సీఈసీ ఓ ముప్పులా తయారయ్యారు. ఓటు హక్కు రద్దు చేసేందుకు ఆయన ఎవరు?" అని సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ప్రశ్నించారు.

## కాంగ్రెస్, బీఆర్ఎస్‌లను రాజకీయ నిమజ్జనం చేద్దాం: బండి సంజయ్

హైదరాబాద్:(తెలంగాణ వాణి)



ఖైరతాబాద్ ఉప ఎన్నిక అనివార్యం అని ఈ ఉప ఎన్నికల్లో పోటీ చేసే అర్హత కూడా కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు లేదని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు సిగ్గుతో తలదించుకోవాలని ఆయారాం, గయారాం...ఫిర్ ఘర్ వాపస్ ఇదేనా మీ మీ సంస్కృతి అని ప్రశ్నించారు. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అనర్హత పిటిషన్?పై ఇవాళ సుప్రీంకోర్టు తీర్పు వెలువరించిన నేపథ్యంలో బండి సంజయ్ స్పందించారు. సుప్రీంకోర్టు తీర్పుతో చెంప దెబ్బ కొట్టినా మీకు సిగ్గు రాదా? ఇప్పటికి కూడా ఎవరికి వారే తమ విజయంగా భావిస్తారా? మీ అవకాశవాద, అధికార రాజకీయాల కోసం ఫిరాయింపులను ప్రోత్సహిస్తారా? అని నిలదీశారు.




- ఎమ్మెల్యే అనర్హత వేటు విషయంలో సుప్రీంలో దాఖలు చేసిన పిటిషన్
- అత్యున్నత న్యాయస్థానం డిస్మిస్ చేసింది.
- దానం నాగేందర్‌ను ఎమ్మెల్యే పదవికి అనర్హుడిగా ప్రకటిస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించింది.
- ఒక పార్టీ నుంచి గెలిచి.. మరో పార్టీ తరపున పోటీ చేయడాన్ని సుప్రీంకోర్టు తప్పుబట్టింది.
- ఘర్‌వాపసీ చట్టసభ సభ్యులకు వర్తించదని..
- హైకోర్టు తీర్పులో జోక్యం చేసుకోవడానికి ఏమీ లేదని స్పష్టం చేసింది.
- ఒక పార్టీ నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన వ్యక్తి మరో పార్టీ నుంచి లోక్‌సభకు పోటీచేయకూడదని రాజ్యాంగపరమైన నిషేదం లేదు
- దానం నాగేందర్ సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటిషన్

హైదరాబాద్ తెలంగాణ వాణి)

సుప్రీంకోర్టులో దానం నాగేందర్‌కు చుక్కెదురైంది. అనర్హత వేటు విషయంలో ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను అత్యున్నత న్యాయస్థానం డిస్మిస్ చేసింది. దానం నాగేందర్‌ను ఎమ్మెల్యే పదవికి అనర్హుడిగా ప్రకటిస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించింది. ఒక పార్టీ నుంచి గెలిచి.. మరో పార్టీ తరపున పోటీ చేయడాన్ని సుప్రీంకోర్టు తప్పుబట్టింది. ఘర్‌వాపసీ చట్టసభ సభ్యులకు వర్తించదని.. హైకోర్టు తీర్పులో జోక్యం చేసుకోవడానికి ఏమీ లేదని స్పష్టం చేసింది. ఒక పార్టీ నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన వ్యక్తి మరో పార్టీ నుంచి లోక్‌సభకు పోటీచేయకూడదని రాజ్యాంగపరమైన నిషేధమేమీ లేదని దానం నాగేందర్ సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌లో పేర్కొన్నారు. దాన్ని ప్రాతిపదికగా తీసుకొని హైకోర్టు తనను ఎమ్మెల్యేగా అనర్హుడిగా ప్రకటించడాన్ని తప్పుబట్టారు. గతంలో ఇలా వేరే పార్టీ నుంచి పోటీచేశారన్న కారణంతో బిహార్‌కు చెందిన మహాచంద్రప్రసాద్‌ను సుప్రీంకోర్టు అనర్హుడిగా ప్రకటించిందన్న ఏకైక కారణాన్ని ప్రాతిపదికగా తీసుకొని స్పీకర్ ఆదేశాలను హైకోర్టు కొట్టేయడం పొరపాటు అని పేర్కొన్నారు.

# ప్రపంచ పర్యాటక పటంలో తెలంగాణకు ప్రత్యేక స్థానం కల్పించాలి

- పర్యాటకం అంటే ప్రదేశాల అభివృద్ధి మాత్రమే కాదు..
- తెలంగాణ బ్రాండ్‌ను ప్రపంచానికి పరిచయం చేయాలి
- పీపీపీ విధానంలో కొత్త ప్రాజెక్టులు.. ప్రైవేట్ పెట్టుబడులకు ప్రోత్సాహం
- టెంపుల్, ఎకో, హిల్ టూరిజంపై ప్రత్యేక దృష్టి
- పర్యాటక శాఖ ఆస్తుల సమర్థ వినియోగానికి కార్యాచరణ
- 'తెలంగాణ దర్శిని' ద్వారా విద్యార్థులకు రాష్ట్ర చరిత్ర, సంస్కృతిపై అవగాహన
- ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క



హైదరాబాద్ తెలంగాణ వాణి)

తెలంగాణలో పర్యాటక రంగాన్ని మరింత అభివృద్ధి చేసి, రాష్ట్రాన్ని జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రముఖ పర్యాటక గమ్యస్థానంగా తీర్చిదిద్దేందుకు సమగ్ర కార్యాచరణ రూపొందించాలని ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. గురువారం హైదరాబాద్‌లోని ప్రజా భవన్‌లో పర్యాటక, సాంస్కృతిక శాఖలపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సమీక్ష నిర్వహించారు. పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి రాష్ట్రంలోని పర్యాటక ప్రాజెక్టులు, శాఖ ఆస్తుల వినియోగం, బడ్జెట్ కేటాయింపులు, ప్రైవేట్ పెట్టుబడులు, చారిత్రక కట్టడాల పరిరక్షణ, పర్యాటక బ్రాండింగ్ తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ పర్యాటక అభివృద్ధి అంటే కేవలం పర్యాటక ప్రదేశాలను అభివృద్ధి చేయడం మాత్రమే కాదని.. తెలంగాణ చరిత్ర, సంస్కృతి, ప్రకృతి వైభవాన్ని ప్రపంచానికి పరిచయం చేస్తూ 'తెలంగాణ బ్రాండ్'ను బలోపేతం చేయడం కూడా అందులో భాగమని పేర్కొన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంతో పెట్టుబడులు, ఉపాధి, ఆదాయ అవకాశాలను పెంచుతూ రాష్ట్ర పర్యాటక రంగాన్ని కొత్త స్థాయికి తీసుకెళ్లాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. విధానంలో కొత్త పర్యాటక ప్రాజెక్టులుపర్యాటక రంగంలో ప్రభుత్వ పెట్టుబడులతో పాటు ప్రైవేట్ భాగస్వామ్యాన్ని విస్తరించాలని, పబ్లిక్–ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ (ప్రా) విధానంలో కొత్త పర్యాటక ప్రాజెక్టులను అభివృద్ధి చేయాలని భట్టి విక్రమార్క సూచించారు. ప్రభుత్వ నిధులపైనే పూర్తిగా ఆధారపడకుండా పర్యాటక శాఖకు చెందిన ఆస్తులను సమర్థంగా వినియోగించుకోవాలని చెప్పారు. భవనాలు ఉన్న ఆస్తులు, ఖాళీ స్థలాలు, ప్రా విధానంలో అభివృద్ధికి అవకాశం ఉన్న ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక జాబితా రూపొందించాలని అధికారులను ఆదేశించారు. ఆస్తులను ఆదాయ వనరులుగా తీర్చిదిద్దడంతో పాటు పర్యాటక రంగంలోకి మరిన్ని ప్రైవేట్ పెట్టుబడులను ఆకర్షించేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు.

### టూరిజం ద్వారా తెలంగాణకు గ్లోబల్ గుర్తింపు

రాష్ట్రంలో టెంపుల్ టూరిజం, ఎకో టూరిజం, హిల్ టూరిజం తదితర విభాగాలను సమగ్రంగా అభివృద్ధి చేయాలని డిప్యూటీ సీఎం సూచించారు. తెలంగాణలోని చారిత్రక, సాంస్కృతిక, ఆధ్యాత్మిక, ప్రకృతి పర్యాటక ప్రాంతాలను ప్రపంచ పర్యాటక పటంలో నిలిపేలా విస్తృతంగా బ్రాండింగ్, మార్కెటింగ్ చేపట్టాలని చెప్పారు. హైదరాబాద్‌కు వచ్చే దేశీయ, విదేశీ పర్యాటకులు రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలను కూడా సందర్శించేలా ప్రత్యేక టూరిజం సర్క్యూట్లను అభివృద్ధి చేయాలని సూచించారు. పర్యాటక ప్రాంతాల్లో హోటళ్లు, రిసార్టులు, ఇతర మౌలిక వసతుల కల్పనలో ప్రైవేట్ రంగాన్ని భాగస్వామ్యం చేయాలని తెలిపారు. చారిత్రక సంపదను కాపాడుకోవాలి తెలంగాణలోని చారిత్రక కట్టడాలు, వారసత్వ సంపదను పరిరక్షించడం ప్రభుత్వ బాధ్యతలో కీలక భాగమని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. రామప్ప వంటి చారిత్రక ప్రాంతాల్లో పరిరక్షణ, నిర్వహణ, మౌలిక వసతుల కల్పనకు అవసరమైన ప్రభుత్వ సహకారం అందిస్తామని తెలిపారు. వారసత్వ సంపద పరిరక్షణతో పాటు కొత్త పర్యాటక ప్రాజెక్టుల ద్వారా ఆదాయాన్ని పెంచుకునే అవకాశాలను అన్వేషించాలని సూచించారు.

విద్యార్థుల్లో తెలంగాణ చరిత్ర, సంస్కృతి, వారసత్వం, పర్యాటక ప్రాంతాలపై అవగాహన పెంచేందుకు 'తెలంగాణ దర్శిని' కార్యక్రమాన్ని సమర్థంగా అమలు చేయాలని సమావేశంలో సూచించారు. విద్యార్థులను చారిత్రక ప్రదేశాలు, మ్యూజియంలు, ప్రముఖ పర్యాటక ప్రాంతాలకు తీసుకెళ్లడం ద్వారా చిన్న వయసు నుంచే తెలంగాణ చరిత్ర, సాంస్కృతిక వైభవంపై అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. పర్యాటక రంగంలో ప్రైవేట్ పెట్టుబడులకు ఎదురవుతున్న సమస్యలను గుర్తించి పరిష్కరించాలని అధికారులను డిప్యూటీ సీఎం ఆదేశించారు. లీజు విధానాలు, ప్రాజెక్టుల ఆర్థిక సాధ్యత, పెట్టుబడిదారుల ఆసక్తి తదితర అంశాలను సమగ్రంగా పరిశీలించి అవసరమైన మార్పులపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు.

## తప్పుడు ప్రచారం ఎవరు చేసినా వారు ఎంతటి వారైనా వదలబోం

- మాజీ మంత్రి హరీశ్ రావు
- కాంగ్రెస్ నేతలు చేసిన క్షుద్రపూజల ఆరోపణలపై కోర్టును ఆశ్రయించిన మాజీ మంత్రి
- పీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ అద్దంకి ఇప్పటికే లీగల్ నోటీసులు
- వారి వద్ద నుంచి స్పందన లేకపోవడంతో కోర్టులో పరువు నష్టం దావా



## మాజీ సైనికుల సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి: గవర్నర్ శివప్రతాప్ శుక్లా

హైదరాబాద్ తెలంగాణ వాణి)

దేశ రక్షణ కోసం ప్రాణాలర్పించిన అమరవీరుల కుటుంబాలకు, మాజీ సైనికులకు అండగా నిలవడం పౌర సమాజం, ప్రభుత్వ యంత్రాంగం కనీస బాధ్యత అని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివప్రతాప్ శుక్లా తెలిపారు. మాజీ సైనికులు, వారిపై ఆధారపడిన కుటుంబాల సంక్షేమం, పునరావాసంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని ఆదేశించారు. గురువారం హైదరాబాద్‌లోని లోక్‌భవన్‌లో సాయుధ దళాల పతాక దినోత్సవ నిధి రాష్ట్ర నిర్వహణ కమిటీ 5వ ఉన్నతస్థాయి సమావేశం గవర్నర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మాజీ సైనికుల సంక్షేమ పథకాలు, వారి సమస్యల సత్వర పరిష్కారం, ప్రభుత్వ ప్రయోజనాలను సకాలంలో అందించడం తదితర కీలక అంశాలపై ఆయన అధికారులతో సమగ్రంగా సమీక్షించారు. దేశం కోసం సర్వస్వం త్యాగం చేసిన ఏ ఒక్క మాజీ సైనికుడు లేదా వారి కుటుంబ సభ్యులు ప్రభుత్వ సహాయం కోసం ఎదురుచూసే దుస్థితి రాకూడదని గవర్నర్ స్పష్టం చేశారు. ఆ దిశగా అధికారులందరూ సమష్టి కృషితో పనిచేయాలని దిశానిర్దేశం చేశారు.

రక్షణ దళాలకు, పౌర సమాజానికి మధ్య ఉన్న పరస్పర విశ్వాసానికి, కృతజ్ఞతా భావానికి సాయుధ దళాల పతాక దినోత్సవ నిధి "ఫ్లాగ్ డే ఫండ్" ఒక గొప్ప ప్రతీకగా నిలుస్తుందని ఆయన అభివర్ణించారు. మాజీ సైనికులకు అందించే సేవలను మరింత మెరుగుపరచాలని, వారు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు సానుభూతితో, సకాలంలో పరిష్కరించేలా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని



అధికారులకు సూచించారు. వారి పునరావాస కార్యక్రమాల్లో ఎక్కడా ఎలాంటి లోటుపాట్లు రాకుండా చూడాలన్నారు. ముఖ్యంగా సీఎస్ఆర్ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద సాయుధ దళాల పతాక దినోత్సవ నిధికి విరాళాలు అందించి, సైనిక కుటుంబాల సంక్షేమానికి తమ వంతు సహకారం అందించాలని కోరారు.

ఈ సమావేశంలో తెలంగాణ సైనిక సంక్షేమ శాఖ డైరెక్టర్ బ్రిగేడియర్ ఎన్.ఆర్. బాబు మాట్లాడుతూ.. సైనిక సంక్షేమ బోర్డును మరింత బలోపేతం చేయడానికి, మాజీ సైనికులు, వారి ఆధారితులకు సేవల విస్తరణకు తీసుకుంటున్న చర్యలను కమిటీకి వివరించారు. అనంతరం మాజీ సైనికుల సంక్షేమానికి, నిధుల వినియోగానికి సంబంధించిన పలు కీలక ప్రతిపాదనలపై సుదీర్ఘంగా చర్చించిన నిర్వహణ కమిటీ వాటన్నింటికీ ఆమోదముద్ర వేసింది. లోక్‌భవన్‌లో జరిగిన ఈ సమావేశంలో గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం. దానకిషోర్, రాష్ట్ర హోంశాఖ ముఖ్య కార్యదర్శి ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



## ఖైరతాబాద్ మహా గణపతి శోభాయాత్ర ప్రారంభం!

హైదరాబాద్: మహానగరంలో వినాయక చవితి ఉత్సవాలు చివరి దశకు చేరాయి. అత్యంత వైభవంగా సాగిన తొమ్మిది రోజుల పూజల అనంతరం భక్తులు గణనాథులకు కన్నీటి వీడ్కోలు పలికేందుకు సమాయత్తమయ్యారు. భాగ్యనగరంలో సామూహిక వినాయక నిమజ్జన శోభాయాత్రకు అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. జీహెచ్ఎంసీ పరిధిలో మొత్తం 141 నిమజ్జన కేంద్రాలను ఏర్పాటు చేయగా, మూడు కార్పొరేషన్ల పరిధిలో భారీగా 275 క్రేన్లను సిద్ధం చేశారు. ప్రధాన నిమజ్జన కేంద్రమైన హుస్సేన్ సాగర్ చుట్టూ అధికారులు భారీ భద్రతా, సౌకర్యాలు చేపట్టారు. కేవలం సాగర్ చుట్టూనే 47 క్రేన్లను ఏర్పాటు చేయగా, అత్యవసర పరిస్థితుల కోసం మరో 17 క్రేన్లను రిజర్వ్‌లో ఉంచారు.

## తల్లాడలో ఘనంగా గణేష్ నిమజ్జన శోభాయాత్ర

### రెడ్డెం వీరమోహన్‌రెడ్డి నేతృత్వంలో అంబరాన్నంటిన భక్తుల సందడి



**తల్లాడ, సెప్టెంబర్ 24 (తెలంగాణ వాణి):**
తల్లాడ పట్టణంలో రెడ్డెం వీరమోహన్‌రెడ్డి నేతృత్వంలో గణేష్ నిమజ్జన శోభాయాత్రను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. శోభాయాత్రకు పురవీధులు భక్తజనసందోహంతో కిక్కిరిశాయి. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా మహిళలు, చిన్నారులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని నృత్యాలు చేస్తూ సందడి చేశారు. డప్పుల మోతలు, భక్తిగీతాలు, గణనాథుడి నామస్మరణతో పట్టణం మార్మోగింది. అనంతరం గణపతికి భక్తిశ్రద్ధలతో వీడ్కోలు పలికి నిమజ్జనానికి తరలించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు రెడ్డెం నారాయణరెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, సతీష్‌రెడ్డి, కమిటీ సభ్యులు, గణేష్ యువజన కమిటీ సభ్యులు, పలువురు నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

## వాగుల ఉద్ధృతిపై అధికారుల అప్రమత్తత






**తల్లాడ, సెప్టెంబర్ 24 (తెలంగాణ వాణి):**
మండలంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో వాగుల ఉద్ధృతి పెరిగే అవకాశం ఉన్న బిల్లుపాడు, రామచంద్రపురం, గొల్లగూడెం ప్రాంతాల్లో అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. వాగులు, కల్వర్టుల వద్ద రాకపోకలను నియంత్రించేందుకు రహదారులపై అడ్డంకులు ఏర్పాటు చేశారు. తహసీల్దార్ కరుణాకర్‌రెడ్డి, ఎంపీవో శ్రీహరికృష్ణ పరిస్థితిని పరిశీలించి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వాగుల వద్ద నీటి ప్రవాహం పెరిగినప్పుడు దాటేందుకు ప్రయత్నించవద్దని, వాహనదారులు జాగ్రత్తగా ఉండాలని కోరారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని సూచిస్తూ, పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ దీవెల వెంకటేశ్వరరావు, ఉపసర్పంచ్ రుద్రాక్ష రామకృష్ణచారి, అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు



**తల్లాడ, సెప్టెంబర్ 24 (తెలంగాణ వాణి):**
తల్లాడ పట్టణంలోని శ్రీ వాసవి కన్వెన్షన్ హాల్‌లో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వైరా మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కాపా సుధాకర్, ఆర్యవైశ్య మండల సంఘం అధ్యక్షుడు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నంబూరి మోహన్‌రావు పూజల్లో పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన మహా అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, శాంతి సమృద్ధులు కలగాలని వినాయకుడిని ప్రార్థించినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో వేమిశెట్టి వెంకటేశ్వరరావు, కాపా మహేష్, నంబూరి కనకయ్య, గుండ్ల వెంకటేశ్వర్లు, వేమిశెట్టి నాగన్న, నంబూరి నాగేశ్వరరావు, జవాజి పెద్ద నగేష్, శ్రీను, సర్వేశ్వరరావు వేమిశెట్టి శంకర్, తాళ్ల వెంకటేశ్వర్లు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది.

## తుపాను ప్రభావంతో అప్రమత్తంగా ఉండాలి

### అత్యవసరమైతేనే బయటకు రావాలి: తల్లాడ ఎస్సై వెంకటకృష్ణ

**తల్లాడ, సెప్టెంబర్ 24 (తెలంగాణ వాణి):**




బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో వర్షాలు, ఈదురుగాలులు కొనసాగే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తల్లాడ ఎస్సై వెంకటకృష్ణ సూచించారు. అత్యవసరమైతేనే బయటకు రావాలని, చెరువులు, వాగులు, కాలువలు, నీటి ప్రవాహ ప్రాంతాల వైపు వెళ్లవద్దని కోరారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు మరింత జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. వర్షాల సమయంలో విద్యుత్ స్తంభాలు, తీగలు, ట్రాన్స్‌ఫార్మర్లకు దూరంగా ఉండాలని సూచించారు. వరదలు, రహదారులపై నీటి ప్రవాహం, చెట్లు విరిగిపడటం లేదా విద్యుత్ సమస్యలు తలెత్తితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ప్రజల భద్రత కోసం పోలీసులు పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## న్యాయవాదులపై పోలీసుల దాడిని ఖండించిన ఐలు

**కొత్తగూడెం, సెప్టెంబర్ 24 (తెలంగాణ వాణి):**
అత్తాపూర్ పోలీస్‌స్టేషన్‌లో న్యాయవాదులపై పోలీసులు దాడి చేశారన్న ఆరోపణలను ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) నాయకులు ఖండించారు. సెప్టెంబర్ 23న జూనియర్ న్యాయవాదులు షేక్ అకీబ్ జునైద్, ఫిజా షా ఓ ముద్దాయిని యాంటిసిపేటరీ బెయిల్ ఆర్డర్ అమలుకు పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లగా, స్టేషన్ హౌస్ ఆఫీసర్ అతడిని లాకప్‌లో ఉంచి భౌతికంగా దాడి చేశారని వారు ఆరోపించారు. దీనిపై ప్రశ్నించిన న్యాయవాదులను బెదిరించడంతో పాటు, ఘటనను వీడియో తీస్తుండగా వారి సెల్‌ఫోన్లు పగులగొట్టారని పేర్కొన్నారు. ఈ ఘటనపై జాతీయ కౌన్సిల్ సభ్యుడు జే. శివరాం ప్రసాద్, రాష్ట్ర ఐలు సభ్యుడు రమేష్‌కుమార్ మక్కడ్ తదితరులు తీవ్రంగా ఖండించారు. న్యాయవాదులపై దాడికి పాల్పడ్డ పోలీసులపై కేసులు నమోదు చేసి, వృత్తిపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## 52 ఏళ్ల అరుణోదయంలో.. 50 ఏళ్ల విమలక్క ప్రస్థానం

- హైదరాబాద్‌లో 50 గంటల పాటు పాట.. ఆట.. మాటలతో ప్రజా కళా జాతర
- కరీంనగర్‌లో ప్రజా కళా జాతర కరపత్రాల ఆవిష్కరణ.



**కరీంనగర్ టౌన్, సెప్టెంబర్ 24(తెలంగాణ వాణి)“**
52 ఏళ్ల అరుణోదయంలో.. 50 ఏళ్ల విమలక్క ప్రస్థానం” పురస్కరించుకుని ఈ నెల 26 నుంచి 28వ తేదీ వరకు హైదరాబాద్‌లో నిర్వహించ నున్న ప్రజా కళా జాతరను విజయవంతం చేయాలని ప్రజాసంఘాల నాయకులు పిలుపునిచ్చారు. గురువారం రోజున కరీంనగర్ నగరం లోని అమరవీరుల స్తూపం వద్ద తెలంగాణ యునైటెడ్ ఫ్రంట్ జిల్లా పూర్వ అధ్యక్షు డు బొల్లం లింగమూర్తి పటేల్,జిల్లా పూర్వ కార్య దర్శి బిజిగిరి నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రజా కళా జాతర కరపత్రాలను అరుణోదయ కళాకారులు, ప్రజాసంఘాలు, నాయకుల చేతుల మీదుగా ఆవిష్కరిం చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 52 ఏళ్ల అరుణోదయ సాంస్కృతిక ప్రస్థానంలో 50 ఏళ్లుగా విమలక్క కొనసాగిస్తున్న ప్రజా కళా ప్రస్థానాన్ని పురస్కరించుకుని ఈ ప్రజా కళా జాతరను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌లోని ఆర్టీసీ కళ్యాణ మండపం (నాగన్న ప్రాంగ ణంలో) ఈ నెల 26 నుంచి 28 వరకు కార్యక్రమాలు కొనసాగుతాయని పేర్కొ న్నారు. 50 గంటల పాటు పాట..ఆట..మాట ప్రజా కళా జాతరలో భాగంగా 50 గంటల పాటు వివిధ కళా రూపాలు, పాటలు, ఆటలు, మాటల కార్యక్రమాలు నిరంతరాయంగా కొనసా గనున్నాయని తెలిపారు. విమలక్క గత ఐదు దశాబ్దాలుగా వివిధ రాష్ట్రాలు,ప్రాంతాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి కృషి చేశారని తెలిపారు. ముఖ్యంగా తెలంగాణ ఉద్యమ సమయంలో రాష్ట్రవ్యాప్తంగా పర్యటిస్తూ అనేక ధూంధాం కార్యక్రమాలు నిర్వహించి, తన పాట,మాట ద్వారా ఉద్యమ స్ఫూర్తిని ప్రజల్లోకి తీసుకువెళ్లి ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటులో కీలకంగా వ్యవహరించాలని వారు పేర్కొన్నారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో సాంస్కృతిక కళాకారుల పాత్ర కూడా కీలకంగా ఉందని, పాటలు, కళారూపాల ద్వారా ఉద్యమ సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లిన కళాకారులను గుర్తుచేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

ప్రజా సమస్యలు, సామాజిక చైతన్యం, ఉద్యమాల నేపథ్యాన్ని కళారూపాల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం జరుగుతుందని చెప్పారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు,ప్రజా కళలు,సాంస్కృతిక ఉద్యమాలతో సుదీర్ఘ అనుబంధం ఉందని, జిల్లాకు చెందిన కళాకారులు, కవులు,గాయకులు, ప్రజాసంఘాల నాయకులు ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రజా కళా జాతరను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజా ఉద్యమ నాయకురాలు ఓల్లాల వాణి,కళాకారులు పొద్దుపొడుపు శంకర్ దుర్గం మురళి గౌడ్,పల్లె రాజేశం, వెంకటేష్ వెంకీ,గౌడ సంఘం అధ్యక్షుడు కలర్ సత్తన్న, పల్లె నారాయణ గౌడ్,కుల సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు జీఎస్ ఆనంద్,జేఏసీ నాయకుడు కోటేశ్వర్, లింగంపల్లి సత్యనారాయణ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు గాలిపల్లి శ్రీనివాస్ రజక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పూసల సంపత్ కుమార్, ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా కన్వీనర్ సర్దార్ రణధీర్ సింగ్, ఎరుకల సంఘం జిల్లా అధ్యక్షుడు కెమంసారం సమ్మయ్య, బీసీ సంక్షేమ సంఘం మైనార్టీ విభాగం కార్యదర్శి మహమ్మద్ అంజద్, జేఏసీ నాయకులు పెద్దపల్లి మధుసూదన్, తోట రాకేష్ కొల్లిపాక శ్రీనివాస్, ఉద్యమకారుల జేఏసీ మహిళా అధ్యక్షురాలు సుహాసిని బిందు, కార్యదర్శి గడ్డం లత, తదితరులు పాల్గొన్నారు

## కార్మిక సమస్యలు పరిష్కరించాలి

### నాణ్యమైన బొగ్గు సరఫరా చేయాలి: టీబీజీకేఎస్ నేత కూసన వీరభద్రం

**కొత్తగూడెం, సెప్టెంబర్ 24 (తెలంగాణ వాణి):**
సింగరేణి కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, రాష్ట్రంలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా జెన్‌కోకు నాణ్యమైన బొగ్గు సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ టీబీజీకేఎస్, బీఆర్ఎస్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని సింగరేణి భవన్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం యాజమాన్యంతో చర్చించి డైరెక్టర్ ఆపరేషన్స్‌కు వినతిపత్రం అందజేశారు. సింగరేణిలో నెలకు మూడుసార్లు మెడికల్ బోర్డులు నిర్వహించి అన్‌ఫిట్ కేసులను పరిష్కరించాలని, పేర్స్‌పై ఇన్‌కమ్ ట్యాక్స్ మాఫీ చేయాలని, జెన్‌కో నుంచి సింగరేణికి రావాల్సిన బకాయిలను వసూలు చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలను వెంటనే నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ సెంట్రల్ కమిటీ ఉపాధ్యక్షుడు కూసన వీరభద్రం, అధ్యక్షుడు మిరియాల రాజిరెడ్డి, కాపు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.




## రుణ లక్ష్యాల సాధనలో బ్యాంకర్లు చొరవ చూపాలి

### అర్హులైన రైతులందరికీ రుణాలు అందించాలి: అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

**కరీంనగర్, సెప్టెంబర్ 24 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
: జిల్లాలో నిర్దేశించిన రుణ లక్ష్యాలను వందశాతం సాధించేలా బ్యాంకర్లు, శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని అదనపు కలెక్టర్ డి.శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన డీసీసీ, డీఎల్ఆర్‌సీ సమావేశంలో ఆయన మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న రుణ ప్రతిపాదనలను త్వరగా పరిష్కరించి అర్హులైన రైతులు, స్వయం సహాయక సంఘాలు, యువతకు రుణాలు అందించాలని ఆదేశించారు. రుణాల రికవరీపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. 2026--27 ఆర్థిక సంవత్సరానికి రూ.14,846 కోట్లతో రూపొందించిన వార్షిక రుణ ప్రణాళికను కలెక్టర్ ఆవిష్కరించారు. ఇందులో వ్యవసాయ రంగానికి రూ.5,755 కోట్లు, ఎంఎస్ఎంఈ రంగానికి రూ.3,583 కోట్లు కేటాయించారు. 2025--26లో జిల్లాలో రూ.20,000.67 కోట్ల రుణాలు మంజూరైనట్లు అదనపు కలెక్టర్ తెలిపారు. రైతులకు రుణ పునరుద్ధరణపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక శిబిరాలు నిర్వహించాలని సూచించారు. సమావేశంలో ఎల్‌డీఎం ఉమాశంకర్ నందన, నాబార్డ్, ఆర్బీఐ అధికారులు, వివిధ బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు.




## మేము ఎన్నికలకు భయపడం: భువనగిరి ఎంపీ చామల

పవర్ ప్లాంట్ల పేరుతో గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో అవినీతి చేశారని, ఇప్పుడు అదే థర్మల్ పవర్ ప్లాంట్ల వద్దకు వెళ్లి గగ్గోలు పెడుతున్నారని భువనగిరి ఎంపీ, చామల కిరణ్ కుమార్ రెడ్డి మండిపడ్డారు. గురువారం ఆయన గాంధీభవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ కు నాణ్యమైన బొగ్గు సరఫరాకు బీఆర్ఎస్ ప్రభుత్వంలో సరైన చర్యలు తీసుకోలేదని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాతనే యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ ను పూర్తి స్థాయి వినియోగంలోకి తెచ్చామన్నారు. విద్యుత్ కొనుగోళ్లలో కమీషన్లు దండుకున్నారని, సింగరేణిలో కోయగూడెం, సత్తుపల్లి బ్లాకులను బీఆర్ఎస్ హయాంలో ప్రయివేటు వ్యక్తుల చేతుల్లో పెట్టారు..18 గనులు మూతపడే పరిస్థితి బీఆర్ఎస్ హయాంలో వచ్చిందని ఎంపీ చామల విమర్శించారు. కాళేశ్వరం పరిస్థితి లాగానే థర్మల్ పవర్ ప్లాంట్ల పరిస్థితి ఉందని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత సింగరేణిలో బొగ్గు ఉత్పత్తి పెరిగిందన్నారు. కొత్త గనులు సింగరేణికి వచ్చే విధంగా తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంది..సింగరేణిలో బొగ్గు 90 శాతం రాష్ట్రానికి వాడుతున్నామని, దాదాపు 40 లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గులో 36 లక్షల మెట్రిక్ టన్నులు రాష్ట్రంలోని విద్యుత్ అవసరాలకు వాడుతున్నామని కిరణ్ కుమార్ రెడ్డి చెప్పారు. బీఆర్ఎస్ నేతల ఫైల్స్ ఒక్కొక్కటి బయటకు వస్తున్నాయని, బీఆర్ఎస్ హయాంలో సింగరేణికి 35 వేల కోట్ల బకాయిలు పెట్టారు.. బీఆర్ఎస్ ప్రభుత్వంలో కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి లాగ్ బుక్ లు చెక్ చేస్తే విద్యుత్ సప్లై రైతులకు 12 గంటలు కనీసం ఇవ్వలేదని ఆయన విమర్శించారు. థర్మల్ పవర్ ప్లాంట్లను రాష్ట్రంలో నిర్వీర్యం చేశారని, ఫామ్ హౌస్ లు కట్టుకోవడం పైనే బీఆర్ఎస్ నేతలు దృష్టి పెట్టారని ఆయన మండిపడ్డారు. ఆయన ఆరోపించారు.

## జూనియర్ కెమిస్టుల డిప్యుటేషన్లు నిలిపివేయాలి

### అక్రమ డిప్యుటేషన్లు ఆపకపోతే ఆందోళన: ఏఐటీయూసీ కార్యదర్శి గట్టయ్య

**కొత్తగూడెం, సెప్టెంబర్ 24 (తెలంగాణ వాణి):**



సింగరేణి క్వాలిటీ విభాగంలో జూనియర్ కెమిస్టులకు ఇస్తున్న డిప్యుటేషన్లను వెంటనే నిలిపివేయాలని ఏఐటీయూసీ కొత్తగూడెం ఏరియా కార్యదర్శి జక్కుల గట్టయ్య డిమాండ్ చేశారు. సింగరేణి వ్యాప్తంగా సుమారు 16 మంది జూనియర్ కెమిస్టులను ఇతర ఏరియాలకు డిప్యుటేషన్‌పై పంపడం వల్ల ఉద్యోగులు, వారి కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొం టున్నారని తెలిపారు. డిప్యుటేషన్ల విషయంలో పారదర్శక విధానాన్ని పాటించాలని, ఖాళీలను భర్తీ చేయకుండా మిగిలిన సిబ్బందిపై అదనపు పనిభారం మోపడం సరికాదన్నారు. మహిళా ఉద్యోగుల కుటుంబ పరిస్థితులను కూడా పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. డిప్యుటేషన్లను వెంటనే పునఃసమీక్షించి నిలిపివేయకపోతే కార్మికుల పక్షాన ఆందోళన చేపడతామని గట్టయ్య హెచ్చరించారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో దివ్యాంగులకు ప్రాధాన్యత ఇచ్చింది: కొత్వాల



**పాల్వంచ, సెప్టెంబర్ 24 (తెలంగాణ వాణి):**
పాల్వంచలో ఇందిరమ్మ ఇళ్ల (2బీహెచ్‌కే) లబ్ధిదారుల ఎంపికను లాటరీ ద్వారా నిర్వహించారు. జగన్నాథపురంలోని ఫంక్షన్‌హాల్‌లో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, జిల్లా కలెక్టర్ అంకిత్ తదితరులు పాల్గొన్నారు. పాల్వంచలోని 27 డివిజన్ల పరిధిలో 1,254 మంది అర్హులను గుర్తించగా, లాటరీ ద్వారా 360 మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు మాట్లాడుతూ, ఎంపికలో దివ్యాంగులకు ప్రాధాన్యత కల్పించారని తెలిపారు. 360 మంది లబ్ధిదారుల్లో 18 మంది దివ్యాంగులను ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్పొరేటర్లు, వికలాంగుల సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్ఎల్‌సీ సమక్షంలో కుదిరిన ఒప్పందాలు అమలు చేయాలి

### సింగరేణి కార్మికులకు 40 శాతం లాభాల వాటా ఇవ్వాలి : మిర్యాల రంగయ్య

**కొత్తగూడెం, సెప్టెంబర్ 24 (తెలంగాణ వాణి):**



ఆర్ఎల్‌సీ సమక్షంలో సింగరేణి యాజమాన్యం కుదుర్చుకున్న 24 అగ్రిమెంట్లను వెంటనే అమలు చేయాలని ఏఐటీయూసీ అదనపు ప్రధాన కార్యదర్శి మిరియాల రంగయ్య డిమాండ్ చేశారు. గత ఆర్థిక సంవత్సరంలో సంస్థకు వచ్చిన వాస్తవ లాభాలను పారదర్శకంగా ప్రకటించి, కార్మికులకు 40 శాతం వాటా ఇవ్వాలని కోరారు.

మైనింగ్ స్టాఫ్ ప్రమోషన్ పాలసీ సమస్యను పరిష్కరించి అర్హత, సీనియారిటీ ఆధారంగా పదోన్నతులు కల్పించాలని, గనుల్లో మెటీరియల్ కొరతను అధిగమించి కార్మికుల భద్రతకు చర్యలు చేపట్టాలని అన్నారు. ప్రతి ఏరియాలో నెలకు ఒకసారి ‘డయల్ టు జీఎం’, నెలకు రెండుసార్లు మెడికల్ బోర్డు నిర్వహించాలని కోరారు. కొత్త బొగ్గు బ్లాకులను ప్రైవేటీకరించకుండా సింగరేణి కార్మికులతోనే నిర్వహించాలని, సంస్థ విస్తరణకు చర్యలు చేపట్టాలని రంగయ్య డిమాండ్ చేశారు.

## హ్యాపీ హోమ్స్ కాలనీలో యువకుడి దారుణ హత్య

o రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. ఉప్పర్‌పల్లిలోని హ్యాపీ హోమ్స్ కాలనీలో నివాసం ఉంటున్న వసీం (28)ను అతని స్నేహితులే కత్తులతో పొడిచి హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను ఇన్‌స్పెక్టర్ వెంకటేష్ వెల్లడించారు.

## నాలాల్లో చెత్త తొలగించాలి.. యంత్రాలు సిద్ధం చేయాలి

**హనుమకొండ, సెప్టెంబర్ 24 (తెలంగాణ వాణి టౌన్):**

భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి వివిధ శాఖల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీవోలతో గూగుల్ మీట్ ద్వారా సమీక్ష నిర్వహించారు. చెరువులు, వాగులు, వంకల నీటిమట్టాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, గతంలో వరద ముంపునకు గురైన ప్రాంతాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. గ్రేటర్ వరంగల్ పరిధిలో నాలాల్లో పేరుకుపోయిన ప్లాస్టిక్, చెత్తను వెంటనే తొలగించాలని, జేసీబీలు తదితర యంత్రాలను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. కలెక్టరేట్ కంట్రోల్ రూమ్‌లో అధికారులు 24 గంటలు అందుబాటులో ఉండి ప్రజల ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని స్పష్టం చేశారు.

## గణపతికి ఘన వీడ్కోలు



**వనపర్తి, సెప్టెంబర్ 24 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
గణేష్ నిమజ్జనాన్ని పురస్కరించుకుని అఖిలపక్ష ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు డాక్టర్ సతీష్ యాదవ్ ఆధ్వర్యంలో నాయకులు పలు గణపతి మండపాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాలిటెక్నిక్ కళాశాల ఎదుట ఏర్పాటు చేసిన మహాగణపతిని దర్శించుకున్న నాయకులకు నిర్వాహకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి శాలువాలతో సత్కరించారు. అనంతరం హనుమాన్ టేకిడి, సాయినగర్, జింగిడిపురం తదితర ప్రాంతాల్లోని గణపతి విగ్రహాలను దర్శించుకుని వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ చర్ల చందర్, మాజీ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కిరణ్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు వెంకటేశ్వర్లు, టీడీపీ నాయకుడు కొత్తగొల్ల శంకర్, బీజేపీ నాయకులు రవి, రామస్వామి, సాయికుమార్, శివకుమార్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే కుటుంబాన్ని పరామర్శించిన మాజీ మంత్రి డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి



**వనపర్తి, సెప్టెంబర్ 24 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే భీరం హర్షవర్ధన్ రెడ్డి తండ్రి భీరం లక్ష్మారెడ్డి మృతిచెందడంతో మాజీ మంత్రి డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి ఆయన నివాసానికి వెళ్లి చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం పెబ్బేరు మండలం సుగూరు గ్రామానికి చెందిన కుమ్మరి లక్ష్మి పిడుగుపాటుతో మృతి చెందడంతో వనపర్తి ఏరియా ఆసుపత్రిలో ఆమె పార్థివదేహానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.5 వేల ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో టీపీసీసీ రాజీవ్ గాంధీ పంచాయతీరాజ్ సంఘటన్ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ యాదవ్, వనపర్తి సీనియర్ నాయకులు ఎంట్ల రవి, పట్టణ ప్రధాన కార్యదర్శి బాబా, సుగూరు మాజీ సర్పంచ్ రాజశేఖర్ గౌడ్, ద్వారపోగు విజయబాబు, సిరివాటి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## వయోవృద్ధుల సంక్షేమంపై అవగాహన కల్పించాలి



**వనపర్తి, సెప్టెంబర్ 24 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని వనపర్తి జిల్లా ఎస్పీ కార్యాలయంలో గురువారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ సునీత రెడ్డి వయోవృద్ధుల సమాచార సంచికతో పాటు తల్లిదండ్రులు, వయోవృద్ధుల నిర్వహణ, సంక్షేమ చట్టం--2007కు సంబంధించిన పుస్తకాలను విడుదల చేశారు. పోలీస్ స్టేషన్లలో ఏర్పాటు చేయనున్న అవగాహన డిస్ప్లే బోర్డులను ఆవిష్కరించారు. వయోవృద్ధుల హక్కులు, సంక్షేమం, భద్రత, ప్రభుత్వ సేవలు, చట్టపరమైన రక్షణపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని ఎస్పీ సూచించారు. వారోత్సవాల్లో భాగంగా జిల్లావ్యాప్తంగా వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో సుబ్రహ్మణ్యం, డీఎంహెచ్ఓ, భాస్కర్ నాయక్ ,డిఆర్డిఓ రామ మహేశ్వర్ , జిల్లా సంక్షేమ అధికారి సుధారాణి , సీనియర్ సిటిజన్ కమిటీ సభ్యులు, సిడిపిఓలు, జిల్లా సంక్షేమ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రూ.2.16 లక్షలకు గణనాథుని లడ్డూ వేలం



**నాగారం, సెప్టెంబర్ 24 (తెలంగాణ వాణి)**
నాగారం సాయిధరణి కాలనీ ఫేజ్--1లో వినాయక నవరాత్రి ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన గణేష్ లడ్డూ వేలం పాటలో పెద్ద లడ్డూను వెంబటి ఉమేష్ రూ.2.16 లక్షలకు, చిన్న లడ్డూను మాదాసు కుమార్ రూ.1.44 లక్షలకు దక్కించుకున్నారు. లక్కీ డ్రా ద్వారా శ్రీకాంత్--లిఖిత దంపతులు మరో చిన్న లడ్డూను సొంతం చేసుకున్నారు. మాజీ కౌన్సిలర్ గూడూరు ఆంజనేయులు ముఖ్యఅతిథిగా పాల్గొని గత ఏడాది లడ్డూ వేలం విజేతలకు సర్టిఫికెట్లు, సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రతిభ చూపిన చిన్నారులకు మెమెంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సాయిధరణి కాలనీ అధ్యక్షుడు మహమ్మద్ అక్బర్ పాషా, జనరల్ సెక్రటరీ ములుగురి శ్రీనివాస్ గౌడ్, కాలనీ కమిటీ సభ్యులు, భక్తులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకను విజయవంతం చేశారు.

## విద్యుత్ ఉత్పత్తిపై బాల్క సుమన్ ఆందోళన

**మంచిర్యాల, సెప్టెంబర్ 24 (తెలంగాణ వాణి):**
జైపూర్ సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి మందగించడంపై బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఆందోళన వ్యక్తం చేశారు. ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవా లక్ష్మి, ఎమ్మెల్యే అనిల్ యాదవ్, మాజీ మంత్రి జోగు రామన్న, మాజీ ఎమ్మెల్యేలు దుర్గం చిన్నయ్య, కోనేరు కోనప్పతో కలిసి ప్లాంట్‌ను పరిశీలించారు.రెండు యూనిట్లలో ప్రస్తుతం ఒక యూనిట్ మాత్రమే పనిచేస్తోందని బాల్క సుమన్ తెలిపారు. బొగ్గు సరఫరా పరిస్థితిపై అనేక అనుమానాలు ఉన్నాయని, గతంలో ఉన్నట్లు పేర్కొన్న సుమారు 45 లక్షల టన్నుల బొగ్గు నిల్వల వివరాలను యాజమాన్యం వెల్లడించాలని కోరారు. విద్యుత్ కేంద్రం సామర్థ్యానికి అనుగుణంగా ఉత్పత్తి ఎందుకు జరగడం లేదో ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.ప్లాంట్‌లోని పరిస్థితులను పూర్తిగా పరిశీలించేందుకు తమకు అవకాశం కల్పించలేదని ఆయన పేర్కొన్నారు. బొగ్గు లభ్యత, నిల్వలు, సరఫరా, విద్యుత్

ఉత్పత్తికి సంబంధించిన వాస్తవాలను ప్రభుత్వం ప్రజలకు తెలియజేయాలని కోరారు. సింగరేణి వ్యవహారాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. రైతులకు విద్యుత్, సాగునీరు, విత్తనాలు, ఎరువుల సరఫరాలోనూ ప్రభుత్వం విఫలమైందని బాల్క సుమన్ విమర్శించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మాతా శిశు సంరక్షణకు పెద్దపీట : కలెక్టర్ రాజర్షి షా

**ఆదిలాబాద్, సెప్టెంబర్ 24 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
రిమ్స్‌లో ఇటీవల జరిగిన నవజాత శిశువుల వార్డు అగ్ని ప్రమాదం బాధాకరమని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. గురువారం చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ కమిషన్ సభ్యులతో కలిసి రిమ్స్‌ను సందర్శించిన ఆయన పీడియాట్రిక్స్, ఐసీయూ, క్రిటికల్ కేర్ విభాగాలను పరిశీలించి వైద్య సేవలు, భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. రిమ్స్‌లో నవజాత శిశువుల కోసం ఆక్సిజన్ లైనింగ్, బేబీ వార్మర్లు, సీపీఏపీ, వెంటిలేటర్లు, ట్రాన్స్‌పోర్ట్ ఇంక్యుబేటర్ వంటి సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అగ్ని ప్రమాదంలో మృతి చెందిన ఐదుగురు చిన్నారుల కుటుంబాలకు ప్రభుత్వం తరఫున రూ.5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా అందించినట్లు వెల్లడించారు. ఘటనపై సమగ్ర విచారణకు మల్టీ డిసిప్లినరీ కమిటీ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. చికిత్స పొందుతున్న చిన్నారుల్లో ఏడుగురిని హైదరాబాద్‌కు తరలించి మెరుగైన వైద్యం అందిస్తున్నామని, వారి ఆరోగ్య పరిస్థితిని నిరంతరం

పర్యవేక్షిస్తున్నామని కలెక్టర్ పేర్కొన్నారు. కమిషన్ సభ్యులు మరిపెల్లి చందన, ప్రేమలత అగర్వాల్ బాధిత కుటుంబాలను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాజేశ్వర్, రిమ్స్ డైరెక్టర్.డా.జై సింగ్ రాథోడ్, డిఎంఎచ్.ఓ. డా. సాధన, డీడబ్ల్యూఓ మిల్కా, బాలల సంరక్షణ అధికారి రాజేంద్రప్రసాద్, వైద్యులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పంతంగి గ్రామాన్ని సందర్శించిన జెడ్పీ సీఈవో




**చౌటుప్పల్, సెప్టెంబర్ 24 (తెలంగాణ వాణి డివిజన్ ప్రతినిధి):**
చౌటుప్పల్ మండలం పంతంగి గ్రామంలో మంజూరైన ఆర్అండ్‌బీ రహదారి పనులను జెడ్పీ సీఈవో శోభారాణి గురువారం పరిశీలించారు. గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎలినో ప్రభావంతో కలిగే అనర్థాలను నివారించేందుకు పంట కుంటలు, నీటి కుంటలు, ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. గ్రామంలోని చెరువును పూడికతీత చేపట్టి నీరు నిల్వ ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శ్రీలత సుందర్, వార్డు సభ్యులు సప్పిడి ప్రభాకర్ రెడ్డి,మాధవుని పరమేశ్వరి శంకర్, పంచాయతీ సెక్రెటరీ పద్మజ, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బోయ దేవేందర్, మాజీ సర్పంచ్ అంతటి రమేష్ గౌడ్, కడగంచి చలమందరాజు, జనార్ధన్,పబ్బు లింగస్వామి, కడగంచి వెంకటేశం, బోయ దశరథ, ఏపీవో ఈశ్వరయ్య,ఈసి రమాదేవి, టి ఏ నీల, ఫీల్డ్ అసిస్టెంట్ లలిత పాల్గొన్నారు.

## హియరింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలి



**మంచిర్యాల, సెప్టెంబర్ 24 (తెలంగాణ వాణి):**
ఓటరు జాబితా సమగ్ర సవరణ--2026లో భాగంగా మ్యాపింగ్ కాని, అనమలిస్ జాబితాలోని ఓటర్లకు జారీ చేసిన నోటీసులపై హియరింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవనంలో ఎన్నికల అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ధ్రువపత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా, మృతులు, డూప్లికేట్ పేర్లను గుర్తించి అవసరమైన సవరణలు చేపట్టాలని తెలిపారు. రాజకీయ పార్టీలు పోలింగ్ కేంద్రాల వారీగా జాబితాలను పరిశీలించి అభ్యంతరాలను నిర్ణీత గడువులో తెలియజేయాలని కోరారు.

## కొత్తపల్లిలో అభివృద్ధి పనులకు శ్రీకారం

**ఎల్లారెడ్డి, సెప్టెంబర్ 24 (తెలంగాణ వాణి ప్రతినిధి)**

ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని కొత్తపల్లిలో రూ.5 లక్షల ఎస్‌డీఎఫ్ నిధులతో గంగపుత్రుల సంఘ భవన నిర్మాణానికి గురువారం భూమిపూజ నిర్వహించారు. అలాగే మున్సిపల్ నిధులతో హైమాస్ట్ లైట్ల ఏర్పాటు పనులను ప్రారంభించినట్లు మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్ తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు దృష్టికి తీసుకెళ్లగా నిధులు మంజూరు చేసి పనులు వెంటనే ప్రారంభించాలని ఆదేశించారని తెలిపారు. పనులకు నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యేకు కొత్తపల్లి గంగపుత్రుల సంఘం సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ జె జగ్జీవన్, మున్సిపల్ ఏ ఇ వినోద్, పి ఏ సి ఎస్ వైస్ చైర్మన్ మత్త మల ప్రశాంత్ గౌడ్,స్థానిక కౌన్సిలర్స్, కో ఆప్షన్ సభ్యులు,ప్రజలు పాల్గొన్నారు.

## పుష్కరాలకు భక్తులకు అన్ని సదుపాయాలు కల్పించాలి : కలెక్టర్ భవేశ్ మిశ్రా



**నిర్మల్--బాసర, సెప్టెంబర్ 24 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
గోదావరి పుష్కరాలకు బాసరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సదుపాయాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. గురువారం బాసరలో పుష్కరాల ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. భక్తుల రద్దీకి అనుగుణంగా పార్కింగ్ స్థలాలు, వీఐపీ, వీవీఐపీ పార్కింగ్‌తో పాటు హెలిప్యాడ్ ఏర్పాట్లను పర్యవేక్షించాలని సూచించారు. మౌలిక సదుపాయాల పనులను నిర్ణీత గడువులోగా నాణ్యతతో పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో భైంసా సబ్‌కలెక్టర్ అజ్మీరా సంకేత్‌కుమార్, ఆర్అండ్‌బీ ఈఈ సుభాష్, తహసీల్దార్ పవన్ చంద్ర తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు ఉచిత వైద్య సేవలు



**మంచిర్యాల, సెప్టెంబర్ 24 (తెలంగాణ వాణి)**
పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథ్ వెరబెల్లి తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా సేవా సంకల్ప్ అభియాన్‌లో భాగంగా వైశ్య భవన్‌లో గురువారం మెగా వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 2 వేల మందికి పైగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈసీజీ, 2డీ ఎకో, ఛాతీ ఎక్స్‌రే, మామోగ్రామ్, షుగర్ తదితర పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్‌తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

## ఎస్పీ జానకీ షర్మిలను సన్మానించిన మున్సిపల్ చైర్మన్



**నిర్మల్--భైంసా, సెప్టెంబర్ 24 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
నిర్మల్ జిల్లా ఎస్పీ డా. జానకీ షర్మిలను భైంసా మున్సిపల్ చైర్మన్ తూమొల్ల దత్తాత్రి గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల భైంసాలో గణేష్ నిమజ్జన శోభాయాత్రను ప్రశాంతంగా నిర్వహించినందుకు ఎస్పీని అభినందించారు. భద్రతా ఏర్పాట్లను ప్రశంసిస్తూ ఎస్పీని శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు ప్రవీణ్, వాసు, రాహుల్, తాలోడు శ్రీనివాస్, వడ్నపు శ్రీనివాస్, అమోల్, మహేష్, దిలీప్, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

## వి1 మ్యూజిక్ ఛానల్ ప్రారంభించిన పరాశ్రీ స్వామి




**చౌటుప్పల్, సెప్టెంబర్ 24 (తెలంగాణ వాణి డివిజన్ ప్రతినిధి):**
ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని అంభాత్రయ ఆలయ సన్నిధిలో వి1 మ్యూజిక్ ఛానల్ను అంభాత్రయ క్షేత్ర పాలకులు డా. శ్రీ శ్రీ శ్రీ పరాశ్రీ స్వామి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలను చైతన్యపరిచే మంచి పాటలను రూపొందించి అందరి మన్ననలు పొందాలని ఆకాంక్షించారు. అంతకుముందు ముగురమ్మల దర్శనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో వి1మ్యూజిక్ అధినేత వరగంటి రాజేందర్ గౌడ్, వరగంటి మహేందర్ గౌడ్, పల్లె మల్లేశం గౌడ్, మారుపాక శ్రీశైలం గౌడ్, పబ్బు సత్యం గౌడ్ పాల్గొన్నారు.

## విద్యార్థులకు వసతి గృహం ఏర్పాటు



**మంచిర్యాల, సెప్టెంబర్ 24 (తెలంగాణ వాణి):**
విద్యార్థుల సౌకర్యార్థం జైపూర్ మండల కేంద్రంలో షెడ్యూల్డ్ కులాల సంక్షేమ వసతి గృహాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు రాష్ట్ర మంత్రి గడ్డం వివేకానంద తెలిపారు. గురువారం జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్‌తో కలిసి వసతి గృహ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.రూ.1.81 కోట్ల సిఎస్ఆర్ నిధులతో వసతి గృహ నిర్మాణం చేపడుతున్నట్లు మంత్రి వెల్లడించారు. చెన్నూర్ ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలల్లో అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. సోమనపల్లిలో రూ.200 కోట్లతో 2,500 మంది విద్యార్థులకు వసతి కల్పించే యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణం చేపడుతున్నట్లు పేర్కొన్నారు.అనంతరం కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి విద్యార్థులకు అందుతున్న సదుపా యాలను పరిశీలించారు. విద్యార్థులకు బ్యాగులు, బూట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతిని ధులు పాల్గొన్నారు.

## భూముల రీ సర్వే వేగవంతం చేయాలి




**నిర్మల్ టౌన్, సెప్టెంబర్ 24 (తెలంగాణ వాణి విలేఖరి):**
జిల్లాలో కొనసాగుతున్న భూముల రీ సర్వే ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించిన సమీక్షలో రీ సర్వే పురోగతిని పరిశీలించారు. అందుబాటులో ఉన్న 16 సర్వే యంత్రాలతో 16 ప్రత్యేక బృందాల ద్వారా సర్వేను వేగవంతం చేయాలని సూచించారు. భూమి యజమానులు, సరిహద్దు రైతుల సమక్షంలో పారదర్శకంగా సర్వే నిర్వహించి, ముందుగానే తేదీ, సమయాన్ని రైతులకు తెలియజేయాలని ఆదేశించారు. గ్రామాల వారీగా వివరాలను నమోదు చేసి ఖచ్చితమైన మ్యాపులు రూపొందించాలని, సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ నిర్దేశిత లక్ష్యాన్ని త్వరగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రాథోడ్ రమేష్, ఏ.డీ. ల్యాండ్ సర్వే రికార్డ్స్ విఠల్, సంబంధిత అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## దొడర్నా తండాలో ఘనంగా ఆలయ ప్రతిష్ఠాపన



**నిర్మల్--కుబీర్, సెప్టెంబర్ 24 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
కుబీర్ మండలం దొడర్నా తండాలో శ్రీ జగదాంబ మాత, హనుమాన్ ఆలయాల ప్రతిష్ఠాపన, కలశ పూజలు గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రజా ట్రస్ట్ చైర్మన్, బీజేపీ సీనియర్ నాయకుడు భోస్లే మోహన్‌రావు పాటిల్ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల్లో భక్తితో పాటు ఐక్యత, సోదరభావాన్ని పెంపొందిస్తాయని అన్నారు. ఆలయాల అభివృద్ధికి గ్రామస్థులు సమష్టిగా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్థులు, భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

## విద్యార్థుల్లో భయాన్ని తొలగించి లక్ష్య సాధన దిశగా సాగాలి



**వనపర్తి, సెప్టెంబర్ 24 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
విద్యార్థులు భయాలు, సందేహాలు, ఒత్తిళ్లను అధిగమించి ఆత్మవిశ్వాసంతో లక్ష్య సాధన దిశగా ముందుకు సాగాలని మోటివేషనల్ స్పీకర్ వేణుగోపాల్ లక్ష్మీపురం సూచించారు. జాగృతి జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో వనపర్తిలో నిర్వహించిన మోటివేషనల్ సెషన్‌లో ఆయన విద్యార్థులకు పలు సూచనలు చేశారు. కమ్యూనికేషన్, నాయకత్వం, టైమ్ మేనేజ్‌మెంట్, సమస్య పరిష్కారం, నిర్ణయ సామర్థ్యం వంటి నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని తెలిపారు. లక్ష్యాన్ని సాధించే వరకు క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర కృషితో ముందుకు సాగాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అంబటి వినోద్‌కుమార్, ఎండీలు గువ్వల శ్యామ్‌కుమార్, నూకల సత్యనారాయణ, బత్తుల భాస్కర్, డాక్టర్ మురళీధర్, అబ్దుల్ సత్తార్, నవీన్‌కుమార్ రెడ్డి, గంధం నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## బ్యాంకింగ్ పథకాలపై సమీక్ష



**నిర్మల్ టౌన్, సెప్టెంబర్ 24 (తెలంగాణ వాణి విలేఖరి):**
నిర్మల్ మున్సిపల్ కమిషనర్ రవి బాబు, లీడ్ బ్యాంక్ మేనేజర్ రామ్ గోపాల్ అధ్యక్షతన గురువారం పట్టణ స్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశం నిర్వహించారు. స్వయం సహాయక సంఘాల బ్యాంక్ లింకేజీ, పీఎం స్వనిధి, ఇందిరా మహిళా శక్తి, ఇతర స్వయం ఉపాధి పథకాల అమలుపై సమీక్షించారు. లబ్ధిదారులకు పథకాల ప్రయోజనాలు త్వరితగతిన అందేలా బ్యాంకర్లు సహకరించాలని కమిషనర్ కోరారు. సమావేశంలో పట్టణ స్థాయి కోఆర్డినేటర్ సావిత్రి, బ్యాంకర్లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## చిమిర్యాలలో ఘనంగా గణనాథుని నిమజ్జనం



**సంస్థాన్ నారాయణపూర్, సెప్టెంబర్ 24 (తెలంగాణ వాణి డివిజన్ ప్రతినిధి):**
యాదాద్రి భువనగిరి జిల్లా నారాయణపూర్ మండలం చిమిర్యాల గ్రామంలో ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం గణేష్ నిమజ్జనం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక పూజల అనంతరం గ్రామంలో నిమజ్జన శోభాయాత్ర ఉత్సాహంగా సాగింది. ఈ సందర్భంగా నిర్వహించిన గణేష్ లడ్డూ వేలంలో దోనూరు సంజీవరెడ్డి--పూలమ్మ దంపతులు రూ.1.51 లక్షలకు లడ్డూను దక్కించుకున్నారు. కార్యక్రమంలో భక్తులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ నిర్వాహకులు సుర్వి కిరణ్, ఆరుట్ల రాజు, కేసని రమేష్, సుర్వి నరేష్, ఆరుట్ల కిరణ్, మండల్లోజు శ్రీకృష్ణాచారి, పెంబళ్ల వెంకటేష్, మరి సాయి, మల్లేపల్లి సతీష్‌రెడ్డి, మేకల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## మోదుగ ఆకుల విస్తర తయారీ కేంద్రం ప్రారంభం



**ఆదిలాబాద్, సెప్టెంబర్ 24 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
గుడిహత్నూర్ మండలం ధారమడుగు గ్రామంలో ఓఎస్ఎఫ్ ఆర్థిక సహకారంతో ఏర్పాటు చేసిన మోదుగ ఆకుల విస్తర తయారీ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ రాజర్షి షా ప్రారంభించారు. కేంద్రంలోని యంత్రాలు, తయారీ ప్రక్రియను పరిశీలించి మహిళా సంఘాల సభ్యులతో మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో లభించే సహజ వనరులను సద్వినియోగం చేసుకుని మహిళలు స్వయం ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని కలెక్టర్ సూచించారు. మోదుగ ఆకుల విస్తరాలు పర్యావరణహితమైనవని, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేందుకు దోహదపడతాయని తెలిపారు. అనంతరం ధారమడుగులోని నీటి కుంటను పరిశీలించి వర్షపు నీటిని సంరక్షించి వ్యవసాయానికి వినియోగించుకునేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఏ రవీందర్ రాథోడ్, ఈపీఆర్ శివరామ్, తహశీల్దార్ కవితారెడ్డి, స్థానిక సర్పంచ్ సీతాబాయి, సంబంధిత అధికారులు, సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## మావల గణేష్ మండపంలో ప్రత్యేక పూజలు



**ఆదిలాబాద్, సెప్టెంబర్ 24 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
మావలలో ఏర్పాటు చేసిన గణేష్ మండపంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూషా సతీష్ దంపతులు, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. అనంతరం గణేష్ నిమజ్జన శోభాయాత్రలో అధికారులు, ప్రజాప్రతినిధులు భక్తులతో కలిసి బస్సాడి వేషధారణలో సందడి చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని గణనాథునికి ఘనంగా వీడ్కోలు పలికారు.

# భక్తిశ్రద్ధలతో గణేష్ నిమజ్జనం

**యువతతో కలిసి సందడి చేసిన సర్పంచ్ లావుడ్య పూర్ణ దంపతులు**



**రేగళ్ల పెద్దతండా, సెప్టెంబర్ 24 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
రేగళ్ల పెద్దతండా గ్రామపంచాయతీలో శ్రీ వరసిద్ధి వినాయక నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా ముగిశాయి. నవరాత్రుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం వినాయక నిమజ్జనం సందర్భంగా అంగరంగ వైభవంగా శోభాయాత్ర చేపట్టారు. భారీ వర్షం కురుస్తున్నప్పటికీ భక్తులు పెద్ద సంఖ్యలో శోభాయాత్రలో పాల్గొన్నారు. యువకులు, మహిళలు, చిన్నారులు డీజే పాటలకు నృత్యాలు చేస్తూ 'గణపతి బప్పా మోరియా' నినాదాలతో గ్రామ వీధులను మార్మోగించారు. గ్రామ సర్పంచ్ లావుడ్య పూర్ణ--పార్వతీదేవి దంపతులు యువతతో కలిసి శోభాయాత్రలో ఉత్సాహంగా పాల్గొని నృత్యాలు చేస్తూ సందడి చేశారు. అనంతరం శ్రీ వరసిద్ధి వినాయక విగ్రహాన్ని భద్రాచలంలోని గోదావరి నదికి తరలించి భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు. గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ ఉత్సవాలకు ముగింపు పలికారు. కార్యక్రమంలో గ్రామస్తులు, యువత, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## తెలంగాణ రక్షణ సేన జిల్లా అధ్యక్షుడికి ఘన సన్మానం




**కరీంనగర్, సెప్టెంబర్ 24 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
తెలంగాణ రక్షణ సేన కరీంనగర్ జిల్లా అధ్యక్షుడిగా నూతనంగా నియమితులైన గుంజపడుగు హరిప్రసాద్‌తో పాటు మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు పిన్నింటి సంగీత రెడ్డి, నగర పార్టీ అధ్యక్షుడు రంగరవేణి లక్ష్మణ్‌లను దళిత సేన నాయకులు ఘనంగా సన్మానించారు. చంటి శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా హరిప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేస్తూ సామాజిక న్యాయం, అణగారిన వర్గాల హక్కుల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మ్యాకల తిరుపతి, శ్రీరాముల రమేష్, ధర్మారెడ్డి, లింగంపల్లి శ్రీనివాస్, ఉల్లేంగుల నరేష్, లంక మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ నోటీసులు సకాలంలో బీఎల్ఓలకు అందించాలి



**రాయికోడ్, సెప్టెంబర్ 24 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
ఎస్ఐఆర్‌లో భాగంగా నోటీసులు అందుకున్న ఓటర్లు తమ గుర్తింపు పత్రాలతో సకాలంలో బీఎల్ఓలకు వివరాలు అందించాలని స్థానిక సర్పంచ్ అశ్విని సంగమేశ్వర్ పాటిల్ సూచించారు. గురువారం మహ్మదాపూర్‌లో ఎంపీడీఓ మాసూద్ షరీఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఓటర్లు అవసరమైన పత్రాలను సమర్పించి తమ ఓటు హక్కుకు సంబంధించిన వివరాలను సక్రమంగా నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కార్యదర్శి సుజాత, ఫీల్డ్ అసిస్టెంట్ అంజి, బీఎల్ఓ యేసయ్య, ఓటర్లు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## పండుగ వాతావరణంలో కలెక్టరేట్ ప్రారంభోత్సవం



**కరీంనగర్, సెప్టెంబర్ 24 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
ఈ నెల 30న ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా కరీంనగర్ నూతన సమీకృత కలెక్టరేట్ ప్రారంభోత్సవం జరగనున్న నేపథ్యంలో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ ప్రధాన ద్వారం, భవనం, పరిసరాలను అలంకరించి పండుగ వాతావరణం కల్పించాలని సూచించారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో భద్రత, ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, కలెక్టర్ చిత్రా మిశ్రా, పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం తదితరులతో కలిసి నూతన కలెక్టరేట్, సభా వేదిక, హెలిప్యాడ్ తదితర ప్రాంతాలను పరిశీలించారు.

## ఆడుకుంటూ వెళ్లిన బాలుడిని కబళించిన కరెంట్..

కొణిజర్ల : అప్పటివరకు అల్లారుముద్దుగా ఇంట్లో తిరుగుతూ ఆడుకున్న తొమ్మిది నెలల పసిబాలుడిని విద్యుత్ రూపంలో మృత్యువు కబళించింది. ఇంటి ఆవరణలో ఆడుకుంటున్న సమయంలో విద్యుత్ షాక్‌కు గురై బాలుడు మృతి చెందడంతో చిన్న మునగాల గ్రామంలో విషాదం నెలకొంది. కుమారుడిని కోల్పోయిన తల్లిదండ్రుల రోదనలు చూపరులను కంటతడి పెట్టించాయి. స్థానికులు, మృతుడి కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. కొణిజర్ల మండలం చిన్న మునగాల గ్రామానికి చెందిన ఇల్లెందుల రమేష్, మమత దంపతుల తొమ్మిది నెలల కుమారుడు అవేద్ గురువారం సాయంత్రం ఇంటి ఆవరణలో ఆడుకుంటున్నాడు. ఈ క్రమంలో ఇంటి ఆవరణలో ఏర్పాటు చేసిన ఎర్త్ పైపుపై బిగించిన స్టీల్ ప్లేట్‌కు వర్షం కారణంగా విద్యుత్ సరఫరా అయినట్లు తెలుస్తోంది.

## టీబీ రహిత గ్రామాలే లక్ష్యం : డాక్టర్ హిమబిందు

**అనుమానితులకు పరీక్షలు.. నిర్ధారణ అయిన వారికి సత్వర చికిత్స**



**జమ్మికుంట, సెప్టెంబర్ 24 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
టీబీ వ్యాధిని సమూలంగా నిర్మూలించి గ్రామాలను టీబీ రహితంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా క్షయ నియంత్రణ అధికారి డా. హిమబిందు పిలుపునిచ్చారు. జమ్మికుంట మున్సిపల్ కార్యాలయంలో జమ్మికుంట, ఇల్లందకుంట, వీణవంక మండలాల పల్లె దవాఖానాల వైద్యాధికారులు, ఏఎన్ఎంలకు గురువారం టీబీపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డా. హిమబిందు మాట్లాడుతూ గ్రామాల్లో టీబీ లక్షణాలు, పరీక్షలు, చికిత్సపై విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. అనుమానితులను గుర్తించి పరీక్షలు నిర్వహించి, వ్యాధి నిర్ధారణ అయిన వారికి వెంటనే చికిత్స ప్రారంభించాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, వైద్య సిబ్బంది, గ్రామస్థులు సమన్వయంతో పనిచేసి టీబీ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలని కోరారు. కార్యక్రమంలో డా. ప్రభుదాస్, డిప్యూటీ డీఎంహెచ్ఓ, ఇంపాక్ట్ ఇండియా ఎన్జీఓ జిల్లా కోఆర్డినేటర్ ప్రభాకర్, మండల కోఆర్డినేటర్లు గీతాంజలి, తిరుపతి, టీబీ సూపర్‌వైజర్ దేవేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## నిమజ్జనోత్సవంలో వార్డు సభ్యుడి సందడి



**శంకరపట్నం, సెప్టెంబర్ 24 (తెలంగాణ వాణి):**
కేశవపట్నం గ్రామంలో వినాయక నిమజ్జనోత్సవం సందర్భంగా 12వ వార్డు సభ్యుడు బొజ్జ సుధాకర్ సందడి చేశారు. తోటి వార్డు సభ్యుడు ఎండీ మోయిన్, వార్డు ప్రజలు, యువతతో కలిసి ఉత్సాహంగా నృత్యాలు చేస్తూ వేడుకల్లో పాల్గొన్నారు. సుధాకర్ ప్రజలతో కలిసిమెలిసి ఉత్సాహంగా పాల్గొనడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. భక్తిశ్రద్ధలతో సాగిన నిమజ్జన వేడుకలు సందడిగా జరిగాయి.

## భారీ వర్షాల నేపథ్యంలో విద్యుత్ శాఖ అప్రమత్తం

**వినియోగదారులు జాగ్రత్తలు పాటించాలి: ఎస్ఈ వి. గంగాధర్**



**పెద్దపల్లి, సెప్టెంబర్ 2 (తెలంగాణ వాణి జిల్లా ప్రతినిధి)**
భారీ వర్షాల నేపథ్యంలో పెద్దపల్లి విద్యుత్ శాఖ అప్రమత్తంగా ఉందని సూపరింటెండింగ్ ఇంజనీర్ వి. గంగాధర్ తెలిపారు. విద్యుత్ అంతరాయాలు ఏర్పడితే వెంటనే పునరుద్ధరించేలా సిబ్బంది, సామగ్రిని సిద్ధంగా ఉంచామని చెప్పారు. విద్యుత్ సమస్యల కోసం 24/7 టోల్‌ఫ్రీ 1912కు సంప్రదించాలని సూచించారు. తెగిపోయిన లేదా వేలాడుతున్న విద్యుత్ తీగలను తాకరాదని, తడిసిన స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ పరికరాలకు దూరంగా ఉండాలని హెచ్చరించారు. రైతులు మోటార్లు, స్టార్టర్లు, సర్వీస్ వైర్లు, ఎర్తింగ్ విషయంలో అప్రమత్తంగా ఉండాలని కోరారు. విద్యుత్ షాక్‌కు గురైన వ్యక్తిని నేరుగా తాకకుండా ముందుగా సరఫరా నిలిపివేసి వైద్య సహాయం అందించాలని సూచించారు.

## బస్సు ఢీకొని పంక్చర్ షాపు యజమాని మృతి



**కీసర, సెప్టెంబర్ 24 (తెలంగాణ వాణి):**
కీసరలో ఆర్టీసీ బస్సు ఢీకొని పంక్చర్ షాపు యజమాని మహ్మద్ షకీల్ (50) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం రాత్రి ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంక్ సమీపంలో రోడ్డు దాటుతున్న షకీల్‌ను కీసరగుట్ట నుంచి ఈసీఐఎల్ వైపు వెళ్తున్న రూట్ నంబర్ 242+ ఆర్టీసీ బస్సు (టీఎస్040247) ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన షకీల్‌ను 108లో గాంధీ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. బస్సు డ్రైవర్ నిర్లక్ష్యం, అతివేగమే ప్రమాదానికి కారణమని మృతుడి సోదరుడు మహ్మద్ జమీల్ అహ్మద్ అన్సారీ ఫిర్యాదు చేయడంతో కీసర పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఎన్ఎస్ఎస్‌తో విద్యార్థుల్లో సేవాభావం పెంపొందుతుంది







**జమ్మికుంట, సెప్టెంబర్ 24 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
జమ్మికుంట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మలిచెట్టి కుమార్ మాట్లాడుతూ.. ఎన్ఎస్ఎస్ ద్వారా విద్యార్థుల్లో సేవాభావం, సామాజిక బాధ్యత, నాయకత్వ లక్షణాలు, వ్యక్తిత్వ వికాసం పెంపొందుతాయని అన్నారు. చదువుతో పాటు సమాజం పట్ల బాధ్యతను కలిగి ఉండాలని, సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని విద్యార్థులకు సూచించారు. 1969 సెప్టెంబర్ 24న ఎన్ఎస్-ఎస్ ప్రారంభమైందని, అప్పటి నుంచి విద్యార్థుల్లో సామాజిక సేవా దృక్పథాన్ని పెంపొందించేందుకు కృషి చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ యూనిట్-1 ప్రోగ్రామ్ అధికారి కె. తిరుపతి, యూనిట్-2 ప్రోగ్రామ్ అధికారి ఈ. జ్యోత్స్న దేవకి, అధ్యాపకులు జి. ప్రభాకర్, చి. తిరుపతి, శ్రీధర్, ఎన్. ప్రసాద్, డి మహేష్ ఎండీ ఖలీమ్ , ఎండీ దాదే , అమర జ్యోతి. ఎండీ షేఖిల్. కె. ప్రదీప్, లైబ్రేరియా బి. ప్రగతి, పి. సీమ, జి. కవిత, జి. శ్రీధర్, ఎస్. శ్రీనివాస్, టి. అనూష, జి. హర్షిణి, ఎన్. శివశంకర్, డి. వీరా స్వామి 200మంది విద్యార్థులు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## విద్యుత్ ఘాతంతో యువకుడి మృతి..

**బాధిత కుటుంబాన్ని పరామర్శించిన మంత్రి**



**ఎండపల్లి, సెప్టెంబర్ 24 (తెలంగాణ వాణి):**
జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం కొత్తపేటలో వినాయక నిమజ్జనం సందర్భంగా విద్యుత్ షాక్‌కు గురై కొప్పుల రాజశేఖర్ అనే యువకుడు మృతి చెందాడు. విషయం తెలుసుకున్న రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ గురువారం కొత్తపేటకు చేరుకుని మృతదేహానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. రాజశేఖర్ అకాల మరణంపై మంత్రి దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ, బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని తెలిపారు. ప్రభుత్వపరంగా అందాల్సిన సహాయ సహకారాలను త్వరగా అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## డిండి ప్రాజెక్టు నీటిని జాగ్రత్తగా వినియోగించాలి



**గుండ్లపల్లి, సెప్టెంబర్ 24 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
డిండి ప్రాజెక్టులో ప్రస్తుతం ఉన్న నీటిని జాగ్రత్తగా వినియోగించి ఆయకట్టు పంటలు ఎండిపోకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ సూచించారు. గురువారం అతిథి గృహంలో నీటిపారుదల శాఖ అధికారులతో సమావేశమై మాట్లాడారు. ప్రాజెక్టులోకి త్వరలోనే నీటిని తీసుకొచ్చేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేస్తున్నారని తెలిపారు. రైతులు ఎలాంటి పుకార్లను నమ్మవద్దని ఎమ్మెల్యే కోరారు.

## వినాయక మండపంలో ఘనంగా పూజలు..
## 4 వేల మందికి అన్నప్రసాదం



**మేడ్చల్, సెప్టెంబర్ 24 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
శక్తి సాయినగర్ డివిజన్ మల్లికార్జున్‌నగర్‌లో ఎస్ఆర్ఎస్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. బీజేపీ మేడ్చల్ జిల్లా కౌన్సిల్ సభ్యుడు సంగిశెట్టి రవీంద్ర సాగర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో గౌని ప్రతీప్ సాగర్, అఖిలా సాగర్ దంపతులు పూజలు నిర్వహించారు. కార్యక్రమానికి ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నాయకుడు ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరై భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. ఉత్సవాల్లో భాగంగా సుమారు 4 వేల మందికి అన్నప్రసాదం పంపిణీ చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు, స్థానికులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు, మహిళా నాయకురాళ్లు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు

## 27న కొండా లక్ష్మణ్ జయంతి వేడుకలు

### బాపూజీ బాటలో చేనేతకు బలమైన బాట

**వీణవంక, సెప్టెంబర్ 24 (తెలంగాణ వాణి ప్రతినిధి)**



ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలను ఈ నెల 27న హైదరాబాద్ రవీంద్రభారతిలో ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఫౌండేషన్ కోఆర్డినేటర్ గాదె గుణసాగర్, పద్మశాలి సంఘాల నాయకులు తెలిపారు. గూడూరు శ్రీనివాస్ అధ్యక్షతన జరిగే కార్యక్రమానికి కేంద్ర భూ వనరుల శాఖ జాయింట్ సెక్రటరీ పరికిపండ్ల నరహరి హాజరుకానున్నారు. బాపూజీ తెలంగాణ ఉద్యమం, చేనేత రంగం, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి చేసిన సేవలను ఈ సందర్భంగా స్మరించుకోనున్నారు. రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి చేనేత, పద్మశాలి సంఘాల ప్రతినిధులు, కార్మికులు, బీసీ సంఘాల నాయకులు పాల్గొననున్నట్లు గుణసాగర్ తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## టెక్ నైపుణ్యాలతోనే ఉజ్వల భవిష్యత్తు




**తిమ్మాపూర్, సెప్టెంబర్ 24 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలని జేఎన్టీయూహెచ్ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ (జగిత్యాల) ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డా. జి. నరసింహ సూచించారు. తిమ్మాపూర్ మండలం రామకృష్ణ కాలనీలోని వాగేశ్వరి ఇంజినీరింగ్ కళాశాలలో సీఎస్ఈ, డేటా సైన్స్ విభాగాల ఆధ్వర్యంలో మూడు రోజుల జాతీయ స్థాయి 'టెక్ ఫెస్ట్--2ఖ26'ను గురువారం ప్రారంభించారు. డా. నరసింహ మాట్లాడుతూ టెక్‌ఫెస్ట్‌లు విద్యార్థుల్లో సృజనాత్మకత, పోటీతత్వం, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని అన్నారు. జనరల్ సెక్రటరీ డా. జి. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల సాంకేతిక ప్రతిభకు టెక్‌ఫెస్ట్ వేదికగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో జాయింట్ సెక్రటరీ డా. డి. శ్రీనివాస్ రెడ్డి, సొసైటీ సభ్యులు వినోద్, సి.హెచ్. ప్రకాష్ రెడ్డి, ప్రిన్సిపాల్ డా. సి.హెచ్. శ్రీనివాస్, సీఎస్ఈ విభాగాధిపతి డా. ఎన్. చంద్రమౌళి, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. ఫెస్ట్‌లో పేపర్ ప్రజెంటేషన్, టెక్ క్విజ్, కోడింగ్, డీబగ్గింగ్, పోస్టర్ ప్రజెంటేషన్ తదితర పోటీలు నిర్వహిస్తున్నారు.

## భక్తిశ్రద్ధలతో ప్రకాష్ నగర్ కాలనీ గణనాథుడి నిమజ్జనం



**డిండి, సెప్టెంబర్ 24 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
డిండి మండలం చెరుకుపల్లి పరిధిలోని ప్రకాష్ నగర్ కాలనీలో గణనాథుడి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. తొమ్మిది రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం బుధవారం వినాయక యూత్ ఆధ్వర్యంలో నిమజ్జన శోభాయాత్ర నిర్వహించారు. లడ్డూ వేలం ఉత్సాహంగా సాగగా ముడి శ్రీను--పద్మ దంపతులు పెద్ద లడ్డూ, ముడి శ్రీను--అనూష దంపతులు చిన్న లడ్డూను దక్కించుకున్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యుడు వింజమూరు వెంకటేశ్వర్లు (వెంకటేష్), కాలనీ పెద్దలు గోరేటి వెంకటయ్య, ముడి శ్రీను--అనూష దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవాల విజయవంతానికి వినాయక యూత్ సభ్యులు కేతేపల్లి శేఖర్, ముడి చింటు, వాళ్లందాసు ముత్యాలు, లక్ష్మణ్, గోరటి ఉపేందర్, ముడి నిరంజన్, నల్లవెల్లి నరేష్, కోమిరె అంజి, ఓర్సు శ్రీమన్, రెడ్డిమల్ల రవితేజ, చిన్న, సాయి, భార్గవ్, బన్నీ తదితరులు కృషి చేశారు. అనంతరం మంగళవాయిద్యాలు, యువత నృత్యాల మధ్య గణనాథుడిని ఊరేగించి నిమజ్జనం చేశారు.

## గురుకుల లెక్చరర్లకు గెజిటెడ్ హోదా కల్పించాలి

### డాక్టర్ ఈదునూరి వెంకటేశ్వర్లు

**నర్సంపేట, సెప్టెంబర్ 24 (తెలంగాణ వాణి ప్రతినిధి)**



గురుకులాల్లో పని చేస్తున్న జూనియర్, డిగ్రీ లెక్చరర్లకు గెజిటెడ్ హోదా కల్పించాలని డాక్టర్ ఈదునూరి వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల లెక్చరర్లకు గెజిటెడ్ హోదా ఉన్నప్పటికీ, గురుకుల లెక్చరర్లకు ఇప్పటివరకు ఆ అవకాశం కల్పించలేదన్నారు. 2024లో గురుకులాల్లో జూనియర్, డిగ్రీ లెక్చరర్ పోస్టులను భర్తీ చేసిన వారితో పాటు, గత కొన్నేళ్లుగా సేవలందిస్తున్న అర్హత, అనుభవం కలిగిన లెక్చరర్లకు కూడా గెజిటెడ్ హోదా కల్పించాలని కోరారు. అదనపు విద్యార్హతలు, పీహెచ్‌డీలు కలిగిన పలువురు లెక్చరర్లు ఉన్నారని తెలిపారు. సీనియారిటీ జాబితాను ప్రకటించి, విద్యారంగంలో నూతన సంస్కరణల్లో భాగంగా గురుకుల లెక్చరర్లకు ప్రత్యేక హోదా కల్పించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు.

## ఎఫ్ఎల్ఎన్ పేరుతో ఉపాధ్యాయులపై ఒత్తిడి తగ్గించాలి

**పర్యవేక్షణ టీమ్‌లు సలహాలు, సూచనలకే పరిమితం కావాలి**

**కరీంనగర్, సెప్టెంబర్ 24 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులపై ఎఫ్ఎల్ఎన్ (తొలిమెట్టు) పేరుతో అధికారులు, పర్యవేక్షణ టీమ్‌లు అధిక ఒత్తిడి తీసుకురావడం తగ్గించాలని డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆవాల నరహరి, ప్రధాన కార్యదర్శి చకినాల రామ్‌మోహన్ డిమాండ్ చేశారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలపై పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కొరత, ఉపాధ్యాయుల కొరత, విద్యార్థుల గైర్హాజరు, తల్లిదండ్రుల సహకారం వంటి అంశాలు ప్రభావం చూపుతాయని తెలిపారు. విద్యార్థులు ఆశించిన స్థాయిలో రాణించకపోవడానికి ఉపాధ్యాయులను మాత్రమే బాధ్యులను చేయడం సరికాదన్నారు. ఎఫ్ఎల్ఎన్ పర్యవేక్షణ టీమ్‌లు అజమాయిషీకి కాకుండా ఉపాధ్యాయులకు ఆచరణాత్మక సలహాలు, సూచనలు, అవసరమైన శిక్షణ అందించేలా పనిచేయాలని కోరారు.




టీమ్ సభ్యులు అవసరమైన సందర్భాల్లో తరగతి గదిలో బోధించి ఉత్తమ బోధనా పద్ధతులను తెలియజేయాలన్నారు. ఈ మేరకు డీఈఓ ఎంఈఓలు, హెచ్‌ఎంలు, పర్యవేక్షణ అధికారులు, టీమ్ లీడర్లు, సభ్యులకు స్పష్టమైన సూచనలు ఇవ్వాలని వారు విజ్ఞప్తి చేశారు.

## రైతులంతా తప్పనిసరిగా ఫార్మర్ ఐడీ నమోదు చేసుకోవాలి

**సుజాతనగర్ మండల వ్యవసాయ అధికారి జి. నర్మద**

**సుజాతనగర్, సెప్టెంబర్ 24 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
మండలంలోని రైతులందరూ వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రైతు రిజిస్ట్రేషన్ (ఫార్మర్ ఐడీ) కార్యక్రమంలో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి జి. నర్మద గురువారం ఒక ప్రకటనలో కోరారు. 'ఒక రైతు--ఒక గుర్తింపు--సమగ్ర సేవలు' అనే నినాదంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పంటల కొనుగోళ్లు, ఎరువుల కొనుగోలు, బ్యాంకుల ద్వారా పంట రుణాలు, కేంద్ర--రాష్ట్ర ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలు, ఇతర వ్యవసాయ సేవలు పొందేందుకు ఫార్మర్ ఐడీ అవసరమని పేర్కొన్నారు. సెప్టెంబర్ 22 నుంచి 30 వరకు గ్రామాల్లో రైతు రిజిస్ట్రేషన్ కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. రైతులు తమ గ్రామ వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈవో), మీ-సేవ కేంద్రం



లేదా కస్టమర్ సర్వీసింగ్ సెంటర్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. నమోదుకు ఆధార్ కార్డు, భూమి పాస్‌బుక్, ఆధార్‌కు లింక్ అయిన మొబైల్ ఫోన్ తప్పనిసరిగా తీసుకురావాలని ఏఓ నర్మద తెలిపారు.

## సీఎం పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

**ఈ నెల 30న నూతన సమీకృత కలెక్టరేట్ ప్రారంభం**

**కరీంనగర్ టౌన్, సెప్టెంబర్ 24 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
కరీంనగర్ జిల్లా నూతన సమీకృత కలెక్టరేట్ భవనాన్ని ఈ నెల 30న ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్న నేపథ్యంలో పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ ఛాంబర్‌లో సీఎం పర్యటన ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించిన మంత్రి, కలెక్టరేట్ ప్రధాన ద్వారం, పరిసరాలను సుందరంగా అలంకరించి స్వాగత తోరణాలు ఏర్పాటు చేయాలని సూచించారు. సీఎం పర్యటించే ప్రాంతాల్లో భద్రతా చర్యలు పటిష్టంగా చేపట్టడంతో పాటు ట్రాఫిక్ నియంత్రణకు ముందస్తు ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, కలెక్టర్ చిత్రా మిశ్రా, పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్‌తో కలిసి నూతన కలెక్టరేట్‌ను పరిశీలించారు. తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ ప్రాంగణం, సభా వేదిక, కలెక్టర్ ఛాంబర్, సమావేశ మందిరం, హెలిప్యాడ్‌ను పరి శీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. హెలికాప్టర్‌లో కరీం



నగర్‌కు చేరుకోనున్న సీఎం రేవంత్‌రెడ్డి కలెక్టరేట్‌ను ప్రారంభించిన అనంతరం జిల్లా అధికారులతో సమావేశమై దిశానిర్దేశం చేయనున్నారు. అనంతరం రాజన్న సిరిసిల్ల జిల్లాకు వెళ్లనున్నారు. సీఎం పర్యటన విజయవంతానికి అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి సూచించారు. కార్యక్రమంలో లైబ్రరీ చైర్మన్ సత్తు మల్లేశం, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్‌రెడ్డి, డీఆర్వో స్వామి, ఆర్డీవో షర్మిల, ప్రజాప్రతినిధులు, ముఖ్య నేతలు, జిల్లా స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## డిండి జెడ్పీహెచ్ఎస్‌లో ఎస్‌జీఎఫ్ పోటీలు ప్రారంభం

**దేవరకొండలో స్పోర్ట్స్ అకాడమీ ఏర్పాటుకు కృషి: ఎమ్మెల్యే బాలు నాయక్**

**డిండి, సెప్టెంబర్ 24 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
విద్యతో పాటు క్రీడలకు ప్రాధాన్యత ఇచ్చినప్పుడే విద్యార్థుల్లో సంపూర్ణ వ్యక్తిత్వ వికాసం సాధ్యమవుతుందని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ అన్నారు. డిండి జెడ్పీహెచ్ఎస్‌లో గురువారం నిర్వహించిన 70వ దేవరకొండ నియోజకవర్గ ఎస్‌జీఎఫ్ పోటీలను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అండర్-14, అండర్-17 బాలబాలికల విభాగాల్లో రెండు రోజుల పాటు కబడ్డీ, వాలీబాల్, ఖోఖో తదితర పోటీలు జరగనున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడా ప్రతిభను వెలికితీసి ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. దేవరకొండ ప్రాంతంలో స్పోర్ట్స్ అకాడమీ ఏర్పాటుకు కృషి చేస్తానని తెలిపారు. డిండి క్రీడాకారిణి నారిమళ్ల ప్రవల్లిక అంతర్జాతీయ స్థాయిలో రాణించడం గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో దొంతినేని వెంకటేశ్వర్ రావు, ముత్యాల శశిధర్ రెడ్డి, నల్లగంతుల రవి, హనుమంతు వెంకటేష్ గౌడ్, మారుపాకుల సురేష్ గౌడ్, కిన్నెర హరికృష్ణ, విద్యాశాఖ అధికారులు, ఎస్‌జీఎఫ్ నిర్వాహకులు,



పీఈటీలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, క్రీడాకారులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్యనాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## రైతుల ప్రశ్నలతో జమ్మికుంట పీఏసీఎస్ సమావేశం వాయిదా?

- **లెక్కలు, ఆర్థిక లావాదేవీలపై**

**స్పష్టత ఇవ్వాలని రైతుల డిమాండ్**

**జమ్మికుంట, సెప్టెంబర్ 24 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
జమ్మికుంట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్)లో నిర్వహించిన సమావేశం రైతులు లేవనెత్తిన పలు ప్రశ్నల నేపథ్యంలో వాయిదా పడటం చర్చనీయాంశంగా మారింది. సంఘం నిర్వహణ, ఆర్థిక లావాదేవీలు, ఖర్చులు, నిధుల వినియోగం, తీర్మానాల అమలు తదితర అంశాలపై రైతులు వివరాలు కోరినట్లు సమాచారం. తమ ప్రశ్నలకు పూర్తిస్థాయిలో సమాధానాలు అందకుండానే సమావేశం వాయిదా పడటంపై పలువురు రైతులు అసంతృప్తి వ్యక్తం చేశారు. సంఘానికి సంబంధించిన లెక్కలు, రికార్డులను పారదర్శకంగా వెల్లడించాలని, ప్రతి అంశంపై పాయింట్ వారీగా సమాధానాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పీఏసీఎస్ వ్యవహారాల్లో అవకతవకలు జరిగాయంటూ కొందరు రైతులు అనుమానాలు, ఆరోపణలు వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో వాటిపై ముందస్తు నిర్ధారణకు రాకుండా సంబంధిత ఉన్నతాధికారులు రికార్డులు, లెక్కలు, ఆర్థిక లావాదేవీలను సమగ్రంగా పరిశీలించాలని కోరుతున్నారు. ఆరోపణలు నిజమని తేలితే





నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని, నిరాధారమైతే అధికారికంగా స్పష్టం చేయాలని పేర్కొన్నారు. సమావేశం వాయిదా పడటానికి గల కారణాలను అధికారులు వెల్లడించాలని, తదుపరి సమావేశంలో రైతులు లేవనెత్తిన అన్ని ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు ఇవ్వాలని కోరుతున్నారు. రైతుల భాగస్వామ్యంతో పీఏసీఎస్ కార్యకలాపాలు మరింత పారదర్శకంగా నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నారు.

## కొల్లూరు గణేష్ మండపంలో ఘనంగా అన్నప్రసాదం



**తెల్లాపూర్, సెప్టెంబర్ 24 (తెలంగాణ వాణి ప్రతినిధి)**
కొల్లూరు డబుల్ బెడ్‌రూమ్ ఫేజ్-1 మెయిన్ గణేష్ మండపం వద్ద వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 11వ రోజు ప్రత్యేక పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదం వితరణ చేపట్టారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు రాంబాబు, రాకేశ్వర్ రెడ్డి, రాజిని, లక్ష్మీ దుర్గ, స్వాతి, సంజీవ్ రెడ్డి తదితరుల ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు.

## గ్రామస్తుల నీటి కష్టాలు తీర్చడమే ధ్యేయం

### సర్పంచ్ వెంకటకృష్ణ



**టేక్మాల్ / సెప్టెంబర్ 24 ( తెలంగాణ వాణి )**
గ్రామంలో త్రాగునీటి ఎద్దడి నివారించేందుకు మరియు ప్రజల నీటి అవసరాలను తీర్చేందుకు సుమారు రూ 3 లక్షల వ్యాయాంతో 40 వేల లీటర్ల సామర్థ్యం గల సంపు నిర్మాణ పనులకు గురువారం టేక్మాల్ మండల పరిధిలోని మల్కాపూర్ గ్రామంలో సర్పంచ్ మన్నే వెంకటకృష్ణ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామస్తులకు నీటి ఎద్దడి సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు ఈ సంపు నిర్మాణ పనులు చేపట్టినట్లు తెలిపారు . నిధుల కొరత ఉన్నప్పటికీ ప్రజల అవసరాల దృష్ట ఈ నిర్ణయం తీసుకున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గణేష్. మాజీ సర్పంచ్ పాండ్య నాయక్. వార్డు మెంబర్లు. గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ఊర చెరువు మత్తడి దూకడంతో ప్రత్యేక పూజలు



**చిగురుమామిడి, సెప్టెంబర్ 24 (తెలంగాణ వాణి విలేఖరి):**
రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో చిగురుమామిడి మండలం సుందరగిరి గ్రామంలోని ఊర చెరువు అలుగు పారుతూ మత్తడి దూకడంతో గ్రామంలో ఆనందం నెలకొంది. ఈ సందర్భంగా సర్పంచ్ జంగ శిరీష రమణారెడ్డి ఆధ్వర్యంలో గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సమృద్ధిగా వర్షాలు కురవడంతో తాగు, సాగునీటికి ఇబ్బందులు లేకుండా పోయాయని సర్పంచ్ హర్షం వ్యక్తం చేశారు. పంటలు బాగా పండి రైతులు సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ మెడబోయిన రాజు, వార్డు సభ్యులు వంతడుపుల దిలీప్ కుమార్, శ్రీమూర్తి శ్రీనివాస్, మంథని ప్రియాంక మహేందర్, ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు గందే సంతోష్ కుమార్, మాజీ దేవస్థానం చైర్మన్ గందే సంపత్ కుమార్, పెసరూ శ్రీనివాస్, మారుపాక రమేష్, సుంకరి శ్రీనివాస్, కక్కెర్ల వీరకుమార్, పాలకేంద్రం చైర్మన్ పిట్టల తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా గణేష్ నిమజ్జనం



**మల్లాపూర్, సెప్టెంబర్ 24 (తెలంగాణ వాణి)**
మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో తొలిసారిగా నిర్వహించిన వినాయక నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ముగిశాయి. గురువారం ప్రత్యేక పూజల అనంతరం గణేష్ లడ్డూ వేలం నిర్వహించగా మొగిలిపేటకు చెందిన ఆర్యవైశ్య సంఘ సభ్యులు వెంకటేశ్వర్--గౌతమి దంపతులు రూ.25,116కు లడ్డూను దక్కించుకున్నారు. సంఘం అధ్యక్షుడు సోమ అశ్విన్ కుమార్ వారిని శాలువాతో సన్మానించి లడ్డూ ప్రసాదాన్ని అందజేశారు. అనంతరం సభ్యులు కోలాటాలతో భక్తిశ్రద్ధల మధ్య వాలుగొండ గోదావరి నదిలో గణనాథుడిని నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో జోనల్ చైర్మన్ శివ శ్రీనివాస్ గుప్తా, శివరామ కిషన్ గుప్తా, చౌడారపు శ్రీనివాస్, నూనె శ్రీనివాస్, నూనె అంజనేయులు, చింత శశిధర్, గాది మనోహర్, గాదె శ్రీనివాస్, మైలారం నరేష్ తదితరులు పాల్గొన్నారు.

TELANGANA VANI TELUGU DAILY
R N I No. APTEL/2012/53127
తెలంగాణ వాణి
తెలుగు దినపత్రిక



## పౌష్టికాహారంతోనే చిన్నారుల సంపూర్ణ ఎదుగుదల

### కౌన్సిలర్ కొండ్లెపు ముత్యం



**వేములవాడ, సెప్టెంబర్ 24 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా చిన్నారుల శారీరక, మానసిక ఎదుగుదల మెరుగుపడుతుందని 17వ వార్డు కౌన్సిలర్ కొండ్లెపు ముత్యం, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అంజమ్మ అన్నారు. గురువారం శాస్త్రినగర్ అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన పోషణ కార్యక్రమంలో పాల్గొని గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు అందుతున్న పౌష్టికాహారాన్ని పరిశీలించారు. గర్భిణీలు సమతుల్య ఆహారం తీసుకోవాలని, తల్లి-బిడ్డ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. అనంతరం గర్భిణీ సితారకు అంగన్‌వాడీ కేంద్రంలో శ్రీమంతం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అంజమ్మ, అంగన్‌వాడీ టీచర్ మిరియాల శోభ, ఆశా వర్కర్ విజయ, మున్సిపల్ వార్డు ఆఫీసర్, అంగన్‌వాడీ సిబ్బంది, బాలింతలు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా 9వ జాతీయ పోషణ మాసం



**డిండి, సెప్టెంబర్ 24 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
డిండి మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో డిండి సెక్టార్ ఆధ్వర్యంలో 9వ జాతీయ పోషణ మాసం కార్యక్రమం నిర్వహించారు. సెక్టార్ సూపర్‌వైజర్ ఎం. రేణుక పాల్గొనగా, జిల్లా సంఘం అధ్యక్షురాలు అనిత, కార్యదర్శి గంగిడి జయమ్మ, జేఆర్‌పీ సుందరమ్మ పోషకాహారంపై అవగాహన కల్పించారు. చిరుధాన్యాలు, ఆకుకూరలు, కూరగాయలతో సమతుల ఆహారం తీసుకోవాలని సూచించారు. ప్రతి మహిళా పెరటి తోటలు ఏర్పాటు చేసుకోవాలని, గర్భిణీలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్స్ సత్య వాణి, చంద్రకళ, లావణ్య, సీసీ లక్ష్మయ్య, ఎమ్మెస్ ప్రెసిడెంట్ అనిత, కార్యదర్శి జయమ్మ, అకౌంటెంట్ శారద, కంప్యూటర్ ఆపరేటర్ పీటర్, వివికే, విఓఏ లు పాల్గొన్నారు.

## ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా ఉచిత వైద్య శిబిరం



**భువనగిరి, సెప్టెంబర్ 24 (తెలంగాణ వాణి విలేఖరి):**
యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని హోమియోపతి ఆసుపత్రిలో ఆయుష్ ఆధ్వర్యంలో 11వ ఆయుర్వేద దినోత్సవాన్ని నిర్వహించారు. ధన్వంతరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించిన అనంతరం ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మణ్‌రావు మాట్లాడుతూ ఆయుర్వేదం ప్రాచీన వైద్య విధానమని, ఆహార నియమాలు పాటిస్తూ నిత్యం వ్యాయామం చేయడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. ఆయుష్ జిల్లా ఇంఛార్జి డాక్టర్ వి. విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన సదస్సు, వైద్య శిబిరంలో జిల్లా ఆసుపత్రి ఆర్ ఎం ఓ డాక్టర్ చక్రధర్ జిల్లా ఆసుపత్రి వైద్యులు డాక్టర్ దుర్గా ప్రకాష్ సామాజిక కార్యకర్తలు మాటూరి బాలేశ్వర్ జంపాల అంజయ్య హోమియోపతి ఆసుపత్రి వైద్యులు డాక్టర్ భారతి డాక్టర్ సంధ్య, డాక్టర్ అరుణ, ఫార్మాసిస్టు మంజుల, ఆసుపత్రి సిబ్బంది బాల లక్ష్మి సంధ్యారాణి, అజీమ్, రమేష్, పలువురు రోగులు పాల్గొన్నారు.

## బహుజన అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

**హుస్నాబాద్, సెప్టెంబర్ 24 (తెలంగాణ వాణి ఆర్‌సి):**



వివిధ రంగాల్లో విశేష కృషి చేసిన సిద్దిపేట జిల్లా గ్రామీణ ప్రాంత ప్రముఖులకు న్యూఢిల్లీలో అందించే బహుజన అవార్డులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు బహుజన సాహిత్య అకాడమీ రాష్ట్ర కమిటీ సభ్యులు ముక్కెర సంపత్‌కుమార్ తెలిపారు. నవంబర్ 15న ఢిల్లీలో జరిగే 20వ జాతీయ సదస్సులో మహాత్మా జ్యోతిరావు పూలే, డాక్టర్ బీఆర్ అంబేద్కర్, ఏపీజే అబ్దుల్ కలాం, సేవారత్న, సాహిత్యరత్న, ఉత్తమ సర్పంచ్, ఉత్తమ కౌన్సిలర్, బెస్ట్ ఉమెన్ లీడర్‌షిప్ తదితర అవార్డులు ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలతో పాటు పూలే, అంబేద్కర్ సిద్ధాంతాలతో పనిచేసే వారు, ప్రజా ఉద్యమకారులు, సంఘ సేవకులు, కవులు, కళాకారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. వివరాలకు 9441797207ను సంప్రదించాలని సూచించారు.

## ప్రభుత్వ భూములపై విచారణ చేపడతాం: మంత్రి లక్ష్మణ్‌కుమార్

**ధర్మారం, సెప్టెంబర్ 24 (తెలంగాణ వాణి):**



బీఆర్‌ఎస్ నాయకుల ఫామ్‌హౌస్‌లలో ప్రభుత్వ భూములు ఉన్నట్లు ఆధారాలతో రుజువైతే చట్ట ప్రకారం స్వాధీనం చేసుకుంటామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తెలిపారు. గురువారం ధర్మారంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆరోపణలపై సాక్ష్యాలతో చర్చకు సిద్ధమని పేర్కొన్నారు. కేసీఆర్ ఫామ్‌హౌస్ వద్ద దళితుల ఆందోళన అనంతరం పసుపు నీళ్లతో శుద్ధి చేసిన ఘటనపై బీఆర్‌ఎస్ నేతలు స్పందించాలని డిమాండ్ చేశారు. ధర్మారం మండలంలో ప్రభుత్వ, అసైన్డ్ భూముల ఆక్రమణలపై సమగ్ర విచారణ చేపట్టి, అక్రమంగా ఉన్న భూములను స్వాధీనం చేసుకుని అర్హులైన పేదలకు పంపిణీ చేస్తామని తెలిపారు. సర్వే నంబర్ 676పై విచారణ కొనసాగుతోందన్నారు. జక్కన్నపల్లి, తహసీల్దార్ కార్యాలయం సమీపంలోని ప్రభుత్వ భూములను లేఅవుట్ చేసి పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించనున్నట్లు చెప్పారు. ఎర్రగుంటపల్లిలో ఏటీసీ(ఐటీఐ) నిర్మాణ పనులు త్వరలో ప్రారంభిస్తామని, ధర్మారం సమగ్ర అభివృద్ధికి చర్యలు చేపడుతున్నామని మంత్రి తెలిపారు.

## విద్యార్థుల వ్యక్తిత్వ వికాసంలో ఎన్‌ఎస్‌ఎస్ పాత్ర కీలకం

**హుస్నాబాద్, సెప్టెంబర్ 24 (తెలంగాణ వాణి ఆర్‌సి):**
విద్యార్థుల్లో సేవాభావం, సామాజిక బాధ్యతను పెంపొందించడంలో ఎన్‌ఎస్‌ఎస్ కీలక పాత్ర పోషిస్తుందని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, ఎన్‌ఎస్‌ఎస్ చైర్మన్ చెన్నూరి గంగాధర్ అన్నారు. కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ ఆవిర్భావ వేడుకల్లో ఆయన మాట్లాడారు. విద్యార్థులు నిరాశ, అనవసర ఆవేశాలకు లోనుకాకుండా సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని సూచించారు. ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి తిరునహరి రణధీర్‌కుమార్ మాట్లాడుతూ సేవాభావంతో సమాజంలో మార్పు తీసుకురావచ్చన్నారు. అనంతరం విద్యార్థులతో ఎన్‌ఎస్‌ఎస్ ప్రతిజ్ఞ చేయించి, కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ చెన్నూరి గంగాధర్ తో పాటు ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి తిరునహరి రణధీర్ కుమార్,




అధ్యాపకులు డాక్టర్ ఎస్. ఎస్.రాజు, సుధగోని సత్యనారాయణ, వి. సదాశివ్, బి.ఎల్లయ్య, బి. వాల్య,ఎస్. వెంకట ముత్యం, సిహెచ్. విద్యాసాగర్, పి. చంద్రమోహన్, సిహెచ్ రాజిరెడ్డి, ఎస్. అశోక్, ఎం వెంకటేష్,ఏ. మమత, గ్రంథపాలకులు ఆర్.వాసవి, వెంకటసాయి, ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు విద్యార్థులు పాల్గొన్నారు.

## చెట్టు నరికివేతపై కేశవపట్నంలో వివాదం

**అనుమతులపై స్పష్టత ఇవ్వాలని గ్రామస్తుల డిమాండ్**

**కేశవపట్నం, సెప్టెంబర్ 24 (తెలంగాణ వాణి):**
కేశవపట్నం గ్రామపంచాయతీ పరిధిలో చెట్టు నరికివేత వ్యవహారం వివాదాస్పదంగా మారింది. చెట్టు తొలగింపునకు అటవీశాఖ అనుమతి ఉందంటూ పంచాయతీ గ్రూపులో ఓ లేఖ ప్రచారం కావడంతో గ్రామస్తులు పలు ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. రూ.500 రుసుము చెల్లించినట్లు ఉన్న పత్రాన్ని అనుమతిగా ఎలా పరిగణిస్తారని ప్రశ్నిస్తున్నారు. చెట్టు నరికివేతకు అటవీశాఖ అధికారిక అనుమతి, పంచాయతీ తీర్మానం ఉన్నాయా? అనే విషయాన్ని పంచాయతీ అధికారులు స్పష్టం చేయాలని కోరుతున్నారు. అనుమతులు లేకుండా చెట్టును తొలగించి ఉంటే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. నిమజ్జనం సమయంలోనే చెట్టు అడ్డుగా ఉందంటూ తొలగించాల్సిన అవసరం ఎందుకు వచ్చిందనే అంశంపైనా స్పష్టత ఇవ్వాలని



కోరుతున్నారు. అదేవిధంగా చెట్టు తొలగింపులో కొందరు వార్డు సభ్యుల పాత్రపై వస్తున్న ఆరోపణలను అధికారులు పరిశీలించాలని, అనుమతులు, సంబంధిత పత్రాలను బహిర్గతం చేసి వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## ప్రాథమిక పరిశోధనను ప్రజోపయోగంగా మార్చాలి

### గీతం ఆతిథ్య ఉపన్యాసంలో శాస్త్రవేత్త డాక్టర్ బిపిన్ కుమార్ గుప్తా

**పటాన్ చెరు, సెప్టెంబర్ 25, (తెలంగాణ వాణి):**
ప్రాథమిక పరిశోధనను ప్రజోపయోగంగా మార్చాలిన ఆవశ్యకత ఎంతైనా ఉందని, పరిశోధన, అభివృద్ధి, ఆవిష్కరణల మధ్య సంబంధాన్ని బలోపేతం చేయాలని న్యూఢిల్లీలోని సీఐఎస్ఆర్-జాతీయ భౌతిక శాస్త్ర ప్రయోగశాల శాస్త్రవేత్త డాక్టర్ బిపిన్ కుమార్ గుప్తా అన్నారు. శాస్త్రీయ జిజ్ఞాసను పెంపొందించుకోవాలని, లక్ష్యాలను పట్టుదలతో సాధించాలని, భారతదేశ సాంకేతిక స్వావలంబనను బలోపేతం చేయగల స్వదేశీ సాంకేతికతల అభివృద్ధికి దోహదపడాలని విద్యార్థులను ప్రోత్సహించారు. హైదరాబాదు లోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో ఆత్మ నిర్భర్ భారత్ కోసం కొత్తగా అభివృద్ధి చెందుతున్న నానో/క్వాంటం పదార్థాల రూపకల్పన, ఆవిష్కరణ, స్వదేశీ సాంకేతిక పరిజ్ఞాన అభివృద్ధి అనే అంశంపై గురువారం ఆయన ఆతిథ్య ఉపన్యాసం చేశారు. సెమీ కండక్టర్, క్వాంటం సాంకేతికతల కేంద్రం సహకారంతో, స్కూల్ ఆఫ్ కోర్ ఇంజనీరింగ్ లోని ఈఈసీఈ విభాగం ఈ కార్యక్రమాన్ని



నిర్వహించింది. డాక్టర్ గుప్తా విద్యార్థులకు నానోపదార్థాలు, అభివృద్ధి చెందుతున్న టుడీ (ద్విమితీయ) పదార్థాలు, క్వాంటం పదార్థాలను ప్రాథమికంగా పరిచయం చేస్తూ, వాటి పరిమాణంపై ఆధారపడిన లక్షణాలు, సంభావ్య అనువర్తనాలను వివరించారు. క్వాంటం పదార్థాల పరిశోధన పరిణామ క్రమాన్ని ఆయన వివరిస్తూ, నానో/క్వాంటం సాంకేతికతలలోని పురోగతులు ఆరోగ్య సంరక్షణ, బయోమెడికల్ ఇమేజింగ్, ఫార్మాస్యూటికల్స్, కమ్యూనికేషన్స్, ప్రజాభద్రత, నకిలీ నిరోధక సాంకేతికతలకు ఎలా దోహదపడతాయో వివరించారు.



## రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైన సాయి మణికంఠ స్కూల్ విద్యార్థిని

**ధర్మారం, సెప్టెంబర్ 24 (తెలంగాణ వాణి )**
ధర్మారం మండల కేంద్రంలోని సాయి మణికంఠ మోడ్రన్ హై స్కూల్ కి చెందిన 9వ తరగతి విద్యార్థిని టి. శ్రీ దీక్షిత ఈ నెల 20వ తేదీన కోరుట్లలోని మీని స్టేడియంలో నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలలో యు 16 విభాగంలో 60 మీటర్స్ రన్నింగ్ రేస్ లో ప్రతిభ కనబరిచి ఈనెల 26,27 తేదీలలో హనుమకొండలోని జె.ఎన్.ఎస్ స్టేడియంలో జరిగే తెలంగాణ రాష్ట్ర స్థాయి 12వ జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్ పోటీలకు ఎంపిక అయిందని పాఠశాల కరస్పాండెంట్ జైన సురేష్ కుమార్, మేనేజింగ్ డైరెక్టర్ జైన రమాదేవి తెలిపారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ జైన సురేష్ కుమార్ మేనేజింగ్ డైరెక్టర్ జైన రమాదేవి, పి ఈ టి సాయి కుమార్ ఉపాధ్యాయ బృందం విద్యార్థినిని అభినందించారు.

## కాంగ్రెస్ సీనియర్ నాయకుడు శంకర్ నాయక్ మృతి

### నివాళులర్పించిన ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్

**పీ.ఏ.పల్లి, సెప్టెంబర్ 24 (తెలంగాణ వాణి ప్రతినిధి)**



: పీఏపల్లి మండలం పెద్దగట్టు గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రామవత్ శంకర్ నాయక్ (50) గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలు సుకున్న దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ పెద్దగట్టుకు వెళ్లి శంకర్ నాయక్ భౌతికకాయానికి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి శంకర్ నాయక్ చేసిన సేవలు మరువలేనివని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఆయన మృతితో పెద్దగట్టు గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## జాతీయ పోషకాహార వారోత్సవంపై అవగాహన



**బుగ్గారం, సెప్టెంబర్ 24 (తెలంగాణ వాణి విలేకరి):**
జగిత్యాల జిల్లా బుగ్గారం మండలం యశ్వంతరావుపేట అంగన్వాడీ కేంద్రంలో జాతీయ పోషకాహార వారోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ టీచర్లు చిన్నారులు, గర్భిణీలు, బాలింతలు, మహిళలకు సమతుల్య, పోషకాహారం ప్రాముఖ్యతను వివరించారు. రోజువారీ ఆహారంలో ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, పప్పులు, చిరుధాన్యాలు చేర్చుకోవాలని సూచించారు. చిన్నారుల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు పౌష్టికాహారం ఎంతో అవసరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ నక్క నీలరాణి, ముత్యాల సత్య, నక్క శంకరమ్మ, మరియు తల్లులు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం



**కొమురవెల్లి, సెప్టెంబర్ 24 (తెలంగాణ వాణి ప్రతినిధి):**
సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మండలం రాంసాగర్ గ్రామానికి చెందిన తాడూరి నరసింహులు మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని శ్రీ మల్లికార్జున వర్కర్స్ యూనియన్ సభ్యులు పరామర్శించారు. మృతుడి కుటుంబానికి సానుభూతి తెలిపి రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు యూనియన్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.



## లంబోదరుడికి లక్ష ఉండ్రాళ్ల సమర్పణ

**రాజాపేట, సెప్టెంబర్ 24 (తెలంగాణ వాణి విలేకరి):**
రాజాపేట మండల కేంద్రంలోని శ్రీ రామకృష్ణ సాయి మందిరంలో గురువారం నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా లంబోదరుడికి లక్ష ఉండ్రాళ్లను సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. విగ్రహ దాత బెజగం శ్రీనివాసులు--రాజేశ్వరి దంపతులు తొలుత పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు చలివేదుల వెంకట రామకృష్ణ ప్రసాద్ శర్మ మంత్రోచ్ఛారణల మధ్య భక్తులు ఉండ్రాళ్లు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు.

## కొల్లూరు పాఠశాలలో విద్యార్థులకు యూనిఫాం పంపిణీ

**జహీరాబాద్/ఝరాసంగం: ˀ**
**సెప్టెంబర్ 24(తెలంగాణ వాణి ప్రతినిధి)**



కొల్లూరు గ్రామ ప్రాథమిక పాఠశాలలో సర్పంచ్ చింతలగట్టు శివరాజ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నూతన డ్రెస్ కోడ్ యూనిఫాంలను పంపిణీ చేశారు. విద్యార్థులు యూనిఫాంలు అందుకొని సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు సి.హెచ్. పారమ్మ, మాణయ్య, పంచాయతీ కార్యదర్శి రవి, ఉపాధ్యాయురాలు వనిత, వివో ఏ మరియమ్మ, గ్రామ పెద్దలు వీరన్న పాటిల్ పాల్గొన్నారు.

## పూలమాల వేసి సంతాపం తెలిపిన సిపిఐ నేతలు



**రాజాపేట సెప్టెంబరు 24 (తెలంగాణ వాణి విలేకరి)**
రాజాపేట మండలం లోని బేగంపేట గ్రామానికి చెందిన సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చిగుళ్ల లింగం తండ్రి రేణికుంట పిఎసిఎస్ డైరెక్టర్ చిగుళ్ల చంద్రపాల్ అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. ఆయన మృతదేహంపై పూలమాలు వేసి పలువురు నివాళు లర్పించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి సహాయ కార్యదర్శి బోలగాని సత్యనారాయణ ఎండి ఇమ్రాన్, చెక్క వెంకటేష్ బొడ్డుల ఆదినారాయణ ఒగ్గు కరుణాకర్ మూల హరినాథ్, మూలపోచయ తదితరులు సంతాపం తెలిపారు.

## ఘనంగా ఎన్‌ఎస్‌ఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు




**హుస్నాబాద్, సెప్టెంబర్ 24 (తెలంగాణ వాణి ఆర్‌సి)**
: హుస్నాబాద్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్, ఎన్‌ఎస్‌ఎస్ చైర్మన్ వి.లలిత అధ్యక్షతన అధ్యాపకులు, సిబ్బంది, వాలంటీర్లు, విద్యార్థినులు ఎన్‌ఎస్‌ఎస్ ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా వి.లలిత మాట్లాడుతూ వాలంటీర్లు సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని సూచించారు. ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి డి.కర్ణాకర్ ఎన్‌ఎస్‌ఎస్ లక్ష్యాలు, సేవా కార్యక్రమాలపై వివరించారు. అనంతరం ఆయనను సన్మానించి, కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో అధ్యాపకులు, సిబ్బంది, ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

## నేరెళ్ల శారదకు ఘన సన్మానం

**ఇల్లంతకుంట, సెప్టెంబర్ 24 (తెలంగాణ వాణి ప్రతినిధి):**



తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్మన్‌గా రెండోసారి బాధ్యతలు స్వీకరించిన నేరెళ్ల శారదను ఇల్లంతకుంట శ్రీ సీతారా మచంద్రస్వామి దేవస్థానం చైర్మన్ ఇంగిలే రామారావు హైదరాబాద్‌లోని బుద్ధభవన్‌లో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేయడంతో పాటు దేవస్థానం తరఫున మెమొంటో, ముత్యాల తలంబ్రాలు అందించారు. మహిళల హక్కుల పరిరక్షణ, సాధికారతకు కమిషన్ మరింత సమర్థవంతంగా పనిచేయాలని ఆకాంక్షిస్తూ నేరెళ్ల శారదకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీసీ కార్యదర్శి మేకమల్ల అశోక్, మడిపల్లి గ్రామ సర్పంచ్ మేకమల్ల తిరుమల వెంకటేష్, ఏఎంసీ డైరెక్టర్ ఎగ్గేటి సదానందం తదితరులు పాల్గొని నేరెళ్ల శారదకు అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు.

# దానం తీర్పుపై విపక్షాల 'సుప్రీం' అస్త్రం

- సర్వోన్నత న్యాయస్థానం నిర్ణయాన్ని స్వాగతించిన బీజేపీ, బీఆర్ఎస్
- ప్రజాస్వామ్యం, రాజ్యాంగ నైతికతకు విజయమన్న రామచందర్‌రావు
- మిగతా ఫిరాయింపు ఎమ్మెల్యేలతోనూ రాజీనామా చేయించాలని డిమాండ్
- 'సంవిధాన్ బచావో' మాటలను ఆచరణలో చూపాలన్న హరీశ్‌రావు
- కాంగ్రెస్ ద్వంద్వ వైఖరిని ప్రశ్నిస్తున్న తీర్పంటూ విమర్శ






దుబాయి/హైదరాబాద్, సెప్టెంబర్ 24 తెలంగాణ వాణ
ఖైరతాబాద్ ఎమ్మెల్యేగా దానం నాగేందర్‌ను అనర్హుడిగా ప్రకటిస్తూ తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పులో జోక్యం చేసుకోవడానికి సుప్రీంకోర్టు నిరాకరించడంపై బీజేపీ, బీఆర్ఎస్ నేతలు స్పందించారు. ఈ తీర్పును స్వాగతిస్తున్నట్లు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్‌రావు ప్రకటించగా, కాంగ్రెస్ రాజ్యాంగ పరిరక్షణ మాటలకు ఇప్పుడు అసలు పరీక్ష ఎదురైందని బీఆర్ఎస్ నేత టి.హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. దానం పిటిషన్‌ను సుప్రీంకోర్టు గురువారం కొట్టివేసి, హైకోర్టు చట్టాన్ని సరిగానే అన్వయించిందని పేర్కొంది.

**'అంతిమంగా సత్యానిదే గెలుపు'**

దుబాయిలో ఉన్న రామచందర్‌రావు ఒక ప్రకటన విడుదల చేస్తూ.. దానం నాగేందర్ అనర్హతపై సుప్రీంకోర్టు నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్లు తెలిపారు. దీనిని ప్రజాస్వామ్యం, రాజ్యాంగ నైతికతకు దక్కిన విజయంగా అభివర్ణించారు. ప్రజాప్రతినిధులు రాజ్యాంగానికి లోబడి వ్యవహరించాల్సిందేనన్న సందేశాన్ని తీర్పు ఇచ్చిందని పేర్కొన్నారు. బీజేపీ శాసనసభాపక్షం సాగించిన న్యాయపోరాటం ప్రజాస్వామిక, రాజ్యాంగ విలువల పరిరక్షణకు దోహదపడిందని ఆయన వ్యాఖ్యానించారు. 'ఘర్ వాపసీ' పేరుతో పార్టీ ఫిరాయింపులను సమర్థించుకోలేరన్న విషయం ఈ తీర్పుతో స్పష్టమైందని రామచందర్‌రావు అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఫిరాయింపులను ప్రోత్సహించారని ఆరోపించిన ఆయన.. కాంగ్రెస్‌లో చేరిన ఇతర ఎమ్మెల్యేలతోనూ రాజీనామా చేయించి తిరిగి ప్రజాతీర్పు కోరాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగ విరుద్ధమని తాము భావించే ప్రభుత్వ చర్యలపై న్యాయస్థానాల్లోనూ, ప్రజాక్షేత్రంలోనూ పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. ఇవి రామచందర్‌రావు చేసిన రాజకీయ విమర్శలు, డిమాండ్లు.

**'కాంగ్రెస్ మాటలకు ఇప్పుడు పరీక్ష'**

మరోవైపు హరీశ్‌రావు స్పందిస్తూ.. దానం నాగేందర్ అనర్హతను సుప్రీంకోర్టు సమర్థించడం కాంగ్రెస్ అనుసరిస్తున్న వైఖరిపై ప్రశ్నలు లేవనెత్తుతోందన్నారు. రాజ్యాంగ పరిరక్షణ గురించి రాహుల్‌గాంధీ దేశవ్యాప్తంగా మాట్లాడుతున్నారని, తెలంగాణలో కాంగ్రెస్‌లో చేరిన ఇతర ఎమ్మెల్యేల విషయంలోనూ అదే వైఖరిని ఆచరణలో చూపాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగంపై నిబద్ధత ఉంటే పార్టీ మారిన ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి తిరిగి ప్రజల తీర్పు కోరాలని రాహుల్‌గాంధీ సూచించాలని హరీశ్‌రావు అన్నారు. ఢిల్లీలో రాజ్యాంగ నైతికత గురించి మాట్లాడుతూ తెలంగాణలో తమ పార్టీ వ్యవహారంపై మౌనంగా ఉండటం సరికాదని విమర్శించారు. 'సంవిధాన్ బచావో' రాజ్యాంగ నిబద్ధతా? రాజకీయ నినాదమా? అన్నది కాంగ్రెస్ స్పష్టం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పు దానం నాగేందర్ అనర్హత, ఖైరతాబాద్ స్థానం ఖాళీ కావడానికే ప్రత్యక్షంగా సంబంధించినది. ఇతర ఎమ్మెల్యేలపై అనర్హత లేదా రాజీనామా అంశాలను ఈ తీర్పు స్వయంగా నిర్ణయించలేదు; వారిపై రామచందర్‌రావు, హరీశ్‌రావు చేసిన వ్యాఖ్యలు రాజకీయ డిమాండ్లుగా చూడాల్సి ఉంటుంది.

# రిమ్స్ అగ్నిప్రమాదంపై 8 గంటల విచారణ

**తొలిరోజు విచారణ ముగించిన ఆరుగురు సభ్యుల ప్రత్యేక కమిటీ**

**ప్రమాదం నాటి విధుల్లో ఉన్న సిబ్బందిని ప్రశ్నించిన సభ్యులు**

ఆదిలాబాద్, సెప్టెంబర్ 24 (తెలంగాణ వాణి) ఆదిలాబాద్ రిమ్స్‌లోని ఎస్ఎన్‌సీయూ వార్డులో జరిగిన అగ్నిప్రమాదంపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక కమిటీ తొలిరోజు విచారణ ముగిసింది. సుమారు ఎనిమిది గంటలపాటు ఆరుగురు సభ్యుల కమిటీ ప్రమాదానికి దారితీసిన పరిస్థితులపై వివరాలు సేకరించింది. అగ్నిప్రమాదం జరిగిన రోజు వార్డులో విధులు నిర్వర్తించిన సిబ్బందిని కమిటీ సభ్యులు విడివిడిగా ప్రశ్నించి వివరాలు తెలుసుకున్నారు. ప్రమాదం ఎలా జరిగింది? మంటలను తొలుత ఎవరు గుర్తించారు? ఆ సమయంలో తీసుకున్న చర్యలేమిటి? చిన్నారులను తరలించడంలో ఎదురైన ఇబ్బందులేమిటి? తదితర అంశాలపై సమాచారం సేకరించినట్లు తెలిసింది. వార్డులో ఉన్న అగ్నిమాపక భద్రతా ఏర్పాట్లను కమిటీ పరిశీలించింది. విద్యుత్ కేబుళ్ల పరిస్థితితోపాటు సీసీ కెమెరాల పనితీరును తనిఖీ చేసింది. ప్రమాదానికి గల కారణాలను నిర్ధారించేందుకు అవసరమైన వివరాలు, ఆధారాలను సేకరించిన అనంతరం ఎస్ఎన్‌సీయూ వార్డును మరోసారి సీజ్ చేశారు. రిమ్స్ ఎస్ఎన్‌సీయూ వార్డులో జరిగిన ఈ విషాద అగ్నిప్రమాదంలో ఐదుగురు చిన్నారులు ప్రాణాలు కోల్పోయారు. ఘటనకు దారితీసిన కారణాలు, భద్రతా పరమైన లోపాలు ఉన్నాయా అనే అంశాలపై ప్రత్యేక కమిటీ విచారణ కొనసాగనుంది.





# ప్రణయ్ హత్య కేసు ఖైదీ అబ్దుల్ బారీ మృతి

నల్లగొండ, సెప్టెంబర్ 24 (ఉద్యమ కెటరం) మిర్యాలగూడలో సంచలనం సృష్టించిన అమృత ప్రణయ్ హత్య కేసులో జీవిత ఖైదు అనుభవిస్తున్న అబ్దుల్ బారీ (45) గురువారం మృతి చెందాడు. చర్లపల్లి కేంద్ర కారాగారంలో ఉన్న ఆయన గుండె సంబంధిత సమస్యలతో బాధపడుతున్నట్లు సమాచారం. గురువారం గుండెపోటుతో అస్వస్థతకు గురికావడంతో జైలు అధికారులు గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన కన్నుమూశారు. ప్రణయ్ హత్య కేసులో నల్లగొండ జిల్లా కోర్టు 2025 మార్చి 11న అబ్దుల్ బారీతో పాటు మరో ముగ్గురికి శిక్షలు విధించింది. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఘటనపై అధికారిక వివరాలు వెలువడాల్సి ఉంది.

# ద్విచక్ర వాహనం ఢీకొని ఎస్సై మృతి

- గణేష్ నిమజ్జనోత్సవాల వేళ తీవ్ర విషాదం
- చికిత్స పొందుతూ మృతిచెందిన కొత్తగూడెం టూ-టౌన్ ఎస్సై కె.వెంకన్న
- ఎస్ఐ కుటుంబానికి అండగా ఉంటామని సీఎం రేవంత్ రెడ్డి హామీ



హైదరాబాద్, సెప్టెంబర్ 24 (తెలంగాణ వాణి) హైదరాబాద్‌లో గణేష్ నిమజ్జనోత్సవాల విధుల్లో ఉన్న పోలీస్ అధికారి ప్రమాదవశాత్తూ దుర్మరణం చెందిన విషాదకర ఘటన చోటుచేసుకుంది. ట్యాంక్ బండ్ ఎన్టీఆర్ మార్గ్‌లో నిమజ్జన బందోబస్తు విధుల్లో ఉన్న కొత్తగూడెం టూ-టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్సై కె.వెంకన్నను ఒక గుర్తుతెలియని స్కూటీ వేగంగా ఢీకొట్టి ఆగకుండా వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆయన వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచి గణేష్ నిమజ్జన బందోబస్తు నిమిత్తం హైదరాబాద్ వచ్చిన ఎస్సై వెంకన్నను ఎన్టీఆర్ మార్గ్‌లోని క్రేన్ నంబర్ 2 సమీపంలో విధుల్లో నియమించారు. బుధవారం తెల్లవారుజామున విధి నిర్వహణలో ఉన్న సమయంలో గుర్తుతెలియని ద్విచక్ర వాహనం ఆయనను ఢీకొట్టింది. ప్రాథమికంగా సాధారణ గాయాలుగానే భావించినప్పటికీ, ఆ తర్వాత ఆయనకు తీవ్ర అస్వస్థత, తల తిరగడం వంటి సమస్యలు తలెత్తడంతో సహచర పోలీసులు వెంటనే వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన పరిస్థితి విషమించి ప్రాణాలు కోల్పోయారు.

**సీఎం రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి**

శాంతిభద్రతల పరిరక్షణలో అంకితభావంతో విధులు నిర్వర్తిస్తూ ఎస్ఐ వెంకన్న మృతిచెందడం పట్ల సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వెంకన్న మరణం ఆయన కుటుంబానికే కాకుండా రాష్ట్ర పోలీసు శాఖ మొత్తానికి తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. వెంకన్న కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని హామీ ఇచ్చిన సీఎం, బాధ్యతారాహిత్యంగా వాహనం నడిపి ఎస్సై మృతికి కారణమైన నిందితుడిని వెంటనే గుర్తించి చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు ఉన్నతాధికారులను ఆదేశించారు.



# ఉప ఎన్నికకు సిద్ధం

**సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నా: దానం నాగేందర్**

**చట్టపరంగా ప్రయత్నించడంలో తప్పులేదని వ్యాఖ్య**

**ఎన్నికలు ఎప్పుడొచ్చినా ప్రజల్లోకి వెళ్తానని స్పష్టీకరణ**

**ఏ పార్టీ నుంచి పోటీ చేసేదీ షెడ్యూల్ తర్వాత చెబుతానన్న దానం**

**జూబ్లీహిల్స్ ఫలితమే ఖైరతాబాద్‌లో పునరావృతమవుతుందని ధీమా**

హైదరాబాద్, సెప్టెంబరు 24 తెలంగాణ వాణి) ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానానికి ఉప ఎన్నిక ఎప్పుడు వచ్చినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నానని మాజీ ఎమ్మెల్యే దానం నాగేందర్ ప్రకటించారు. తన అనర్హతపై తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసిన నేపథ్యంలో ఆయన స్పందించారు. సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నానని, చట్టపరంగా ప్రయత్నించడంలో తప్పేమీ లేదని పేర్కొన్నారు. అందులో భాగంగానే న్యాయపోరాటం చేసినట్లు తెలిపారు. మళ్లీ ఎన్నికలకు వెళ్లాలని సుప్రీంకోర్టు చెప్పిందని, ఎన్నికలు ఎప్పుడు వచ్చినా ప్రజల మధ్యకు వెళ్తానని దానం నాగేందర్ తెలిపారు. తాను నిరంతరం ప్రజల్లోనే ఉంటున్నానని, ఇకపైనా ప్రజాక్షేత్రంలోనే రాజకీయ ప్రయాణం కొనసాగిస్తానన్నారు. ఖైరతాబాద్ ఉప ఎన్నికలో ఏ పార్టీ నుంచి పోటీ చేస్తారన్న ప్రశ్నకు ఎన్నికల షెడ్యూల్ వచ్చిన తర్వాతే స్పష్టత ఇస్తానని చెప్పారు. అప్పటి పరిస్థితుల్లో ఎంపీగా పోటీ చేశానని, ఇప్పుడు కూడా ఎన్నికలను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నానన్నారు. బీఆర్ఎస్‌పై ప్రస్తుతం ఎలాంటి వ్యాఖ్యలు చేయబోనని దానం చెప్పారు. ఖైరతాబాద్ ప్రజలకు ఎవరు అండగా ఉన్నారో తెలుసన్నారు. గెలిచినా, ఓడినా నియోజకవర్గ ప్రజలు తనతోనే ఉన్నారని పేర్కొన్నారు. గతంలో ఉప ఎన్నికలో ఓడిపోయినా ఆ తర్వాత రాజకీయంగా ప్రమోషన్ వచ్చిందని గుర్తుచేశారు. తాను ఖైరతాబాద్‌లోనే ఉండాలని, ఢిల్లీకి వెళ్లొద్దనే ఉద్దేశంతో ఎంపీ ఎన్నికల్లో ఓడించారని వ్యాఖ్యానించారు. తాను ఎంపీగా పోటీ చేసినప్పుడు కిషన్‌రెడ్డి భయపడ్డారా లేదా అన్నది ప్రజలకే తెలుసన్నారు. ఖైరతాబాద్ ఉప ఎన్నికలో జూబ్లీహిల్స్ ఫలితమే పునరావృతమవుతుందని దానం నాగేందర్ వ్యాఖ్యానించారు.

# 'చేయూత' దరఖాస్తుల పరిశీలనకు గడువు పొడిగింపు

హైదరాబాద్, సెప్టెంబర్ 24 తెలంగాణ వాణి) చేయూత సామాజిక భద్రత పెన్షన్లకు కొత్తగా వచ్చిన దరఖాస్తుల పరిశీలనకు ప్రభుత్వం గడువు పొడిగించింది. ఇప్పటివరకు ఈనెల 25 వరకు ఉన్న గడువును 30 వరకు మరో ఐదు రోజులు పొడిగిస్తూ 'సెర్ప్' సీఈవో దివ్య దేవరాజన్ ఉత్తర్వులు జారీ చేశారు. క్షేత్రస్థాయి అధికారులు 'సర' విధులు, వినాయక నిమజ్జన ఏర్పాట్లు, ఇతర బాధ్యతల్లో నిమగ్నమై ఉండటంతో నిర్ణీత గడువులో దరఖాస్తుల పరిశీలన పూర్తి చేయలేకపోతున్నామని వచ్చిన విజ్ఞప్తుల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు చేయూత కొత్త పెన్షన్ దరఖాస్తుల పరిశీలనను పొడిగించిన గడువులోగా పూర్తిచేయాలని ఆమె ఆదేశించారు. అర్హత కలిగిన ప్రతి దరఖాస్తును నిబంధనల ప్రకారం పరిశీలించి ప్రక్రియను పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ప్రభుత్వం ఆదేశించింది.

# రోడ్డు ప్రమాదాల నివారణకు కీలక నిర్ణయం

**టీజీ-టీమార్స్' ఏర్పాటు**

**జీవో 135 విడుదల చేసిన సీఎస్**



హైదరాబాద్, సెప్టెంబర్ 24 రాష్ట్రంలో నిత్యం వేధిస్తున్న ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడంతోపాటు రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు సీఎం రేవంత్ రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు. ట్రాఫిక్ నిర్వహణ అంటే కేవలం చలానాలు వసూలు చేయడమే కాకుండా శాస్త్రీయ పద్ధతుల్లో ట్రాఫిక్‌ను నియంత్రించడం, అత్యవసర వైద్య సాయం అందించడమే లక్ష్యంగా తెలంగాణ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్, రోడ్ అండ్ రైల్ సేఫ్టీ బ్యూరో (టీజీ-టీమార్స్)ను ఏర్పాటు చేశారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు గురువారం అందుకు సంబంధించిన జీవో 135 విడుదల చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన నడిచే రాష్ట్ర రోడ్డు భద్రతా మండలి పరిధిలోనే ఈ కొత్త వ్యవస్థ పనిచేస్తుంది. ఈ ప్రత్యేక విభాగం అదనపు డీజీపీ లేదా ఐజీపీ స్థాయి అధికారి నేతృత్వంలో హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తుంది. రాష్ట్రంలోని 32 వేల కిలోమీటర్ల కంటే ఎక్కువ ఉన్న రహదారులు, 1.8 కోట్లకు పైగా ఉన్న వాహనాల రాకపోకలను ఈ బ్యూరో పర్యవేక్షిస్తుంది. రోడ్డు రవాణాతోపాటు మెట్రో, రైల్వే భద్రతను కూడా ఈ విభాగానికే అప్పగించారు. బాధితుల ప్రాణాలు కాపాడేందుకు ప్రతీ పోలీస్ స్టేషన్‌లో 24 గంటలూ అందుబాటులో ఉండేలా ఒక రోడ్ యాక్సిడెంట్ రెస్పాన్స్ ఆఫీసర్‌ను నియమిస్తారు. ప్రమాదం జరిగిన వెంటనే క్షతగాత్రులను గోల్డెన్ అవర్‌లో హాస్పిటల్‌కు తరలించడం వీరి బాధ్యత. అలాగే ఔటర్ రింగ్ రోడ్డు, 50 కి.మీ కంటే ఎక్కువ ఉన్న హైవేలపై స్పీడ్ డిటెక్టర్లు, అత్యాధునిక కెమెరాలతో కూడిన హైవే పెట్రోలింగ్ యూనిట్లు నిరంతరం పహారా కాస్తారు. ఈ వ్యవస్థ నిర్వహణ కోసం ప్రత్యేకంగా ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ ఫండ్‌ను ఏర్పాటు చేశారు. పోలీసులకు వచ్చే ట్రాఫిక్ జరిమానాల మొత్తంలో 40% ఈ నిధికే మళ్లిస్తారు. ఈ నిధులను సిబ్బంది శిక్షణ, అధునాతన సాంకేతికత, పెట్రోలింగ్ వాహనాలు, అత్యవసర రోడ్డు మరమ్మతుల కోసమే ఉపయోగిస్తారు.



## మహేష్ బాబు 'వారణాసి' షూటింగ్ పూర్తి.. ఇక చివరి దశ పనులు జరుపుకుంటున్న రాజమౌళి చిత్రం!

టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబు, గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా, మలయాళ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న భారీ చిత్రం 'వారణాసి'. గ్లోబల్ దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి తెరకెక్కిస్తున్న ఈ సినిమాపై ఇప్పటికే దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. రాజమౌళి గత చిత్రాలకు భిన్నంగా మరింత విస్తృతమైన ప్రపంచాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలనే లక్ష్యంతో ఈ చిత్రాన్ని అత్యంత భారీ స్థాయిలో రూపొందిస్తున్నారు. మహేష్ బాబు కెరీర్‌లోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్టుల్లో ఒకటిగా 'వారణాసి' నిలుస్తోంది. ఈ సినిమా ద్వారా మహేష్ బాబు తొలిసారి రాజమౌళితో కలిసి పనిచేస్తుండటంతో అభిమానుల్లోనే కాకుండా సినీ వర్గాల్లోనూ ఈ చిత్రంపై ప్రత్యేక ఆసక్తి నెలకొంది. ముఖ్యంగా అంతర్జాతీయ ప్రేక్షకులను దృష్టిలో పెట్టుకుని కథ, పాత్రలు, చిత్రీకరణ, నిర్మాణ విలువలను రూపొందిస్తున్నట్లు చిత్ర బృందం ఇప్పటికే పలు సందర్భాల్లో వెల్లడించింది. తాజాగా వినిపిస్తున్న సమాచారం ప్రకారం.. 'వారణాసి'లో మహేష్ బాబు చేయాల్సిన షూటింగ్ భాగం పూర్తయినట్లు తెలుస్తోంది. దీంతో ఇక మహేష్ బాబు తన తదుపరి పనులపై దృష్టి పెట్టేందుకు సిద్ధమవుతున్నారనే చర్చ మొదలైంది. అయితే చిత్ర బృందం నుంచి ఈ విషయంపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. రాజమౌళి సినిమా అంటే ప్రతి సన్నివేశాన్ని అత్యంత జాగ్రత్తగా తెరకెక్కించడం, అవసరమైన స్థాయిలో భారీ సెట్స్, విజువల్ ఎఫెక్ట్స్, యాక్షన్ సన్నివేశాలు రూపొందించడం సహజం. అందుకే 'వారణాసి' షూటింగ్ విషయంలోనూ భారీ షెడ్యూల్స్ కొనసాగుతున్నాయి. మహేష్ బాబు తన భాగాన్ని పూర్తి చేసుకున్నా.. మిగిలిన నటీనటులతో కీలక సన్నివేశాల చిత్రీకరణ కొనసాగుతున్నట్లు సమాచారం. ప్రస్తుతం జరుగుతున్న చిత్రీకరణ ప్రకారం 'వారణాసి' ప్రధాన షూటింగ్ అక్టోబర్ మొదటి వారంలో పూర్తయ్యే అవకాశాలు ఉన్నాయని సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అయితే భారీ స్థాయి నిర్మాణం కావడంతో షూటింగ్ పూర్తయిన తర్వాత కూడా పోస్ట్ ప్రొడక్షన్, విజువల్ ఎఫెక్ట్స్, ఇతర సాంకేతిక పనులకు ఎక్కువ సమయం పట్టే అవకాశం ఉంది. ఈ సినిమా కథ, నేపథ్యం, పాత్రల వివరాలను చిత్ర బృందం పూర్తిగా రహస్యంగా ఉంచుతోంది. ఇప్పటివరకు విడుదలైన ప్రచార చిత్రాలు, టైటిల్‌కు సంబంధించిన సమాచారం సినిమాపై ఆసక్తిని మరింత పెంచాయి. ముఖ్యంగా మహేష్ బాబు పాత్ర ఎలా ఉండబోతోంది? ప్రియాంక చోప్రా పాత్ర ఏ స్థాయిలో ఉంటుంది? పృథ్వీరాజ్ సుకుమారన్ పాత్ర కథలో ఎలాంటి మలుపులు తీసుకురాబోతోంది? అనే ప్రశ్నలు అభిమానుల్లో ఆసక్తిని పెంచుతున్నాయి.

## ప్యారడైజ్'.. నిజమైన ప్రేక్షకులకు ఎలాంటి ఇబ్బంది లేదన్న నాని



తన తాజా చిత్రం 'ది ప్యారడైజ్' విడుదలపై వచ్చిన కోర్టు ఉత్తర్వుల విషయంలో నేచురల్ స్టార్ నాని పూర్తి స్పష్టత ఇచ్చారు. బెంగళూరు కోర్టు ఇచ్చిన ఇంజంక్షన్ ఆర్డర్ కేవలం ఏఐ (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) సాయంతో సృష్టించిన ఫేక్ పోస్టులు, బాట్లకు మాత్రమే వర్తిస్తుందని, నిజమైన ప్రేక్షకుల అభిప్రాయాలకు కాదని తేల్చి చెప్పారు. సినిమా చూసి తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా పంచుకునే హక్కు ప్రేక్షకులకు ఎప్పుడూ ఉంటుందని ఆయన అన్నారు. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో తెరకెక్కిన 'ది ప్యారడైజ్' సినిమా టీజర్ విడుదలైనప్పటి నుంచి సోషల్ మీడియాలో కొందరు కావాలనే ఏఐ టెక్నాలజీ ఉపయోగించి నకిలీ, పరువు నష్టం కలిగించే వ్యాఖ్యలు పోస్ట్ చేస్తున్నారని నిర్మాతలు ఆరోపించారు. ఈ నేపథ్యంలో, నిర్మాత శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర సినిమాస్ ఎల్ఎల్‌పీ బెంగళూరు సివిల్ అండ్ సెషన్స్ కోర్టును ఆశ్రయించగా, సెప్టెంబర్ 19న న్యాయస్థానం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ విషయంపై ముంబైలో జరిగిన ప్రీ-రిలీజ్ ఈవెంట్‌లో నాని మాట్లాడుతూ... కొంతమంది డబ్బులు ఇచ్చి బాట్లతో, ఏఐ టెక్నాలజీతో దుష్ప్రచారం చేయిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తమ పోరాటం అలాంటి వారిపైనే తప్ప, నిజమైన సినీ ప్రియులపై కాదని ఆయన వివరించారు. సినిమా చూసిన తర్వాత ప్రేక్షకులు తమ విమర్శలను, అభిప్రాయాలను ఎలాంటి భయం లేకుండా చెప్పవచ్చని భరోసా ఇచ్చారు. ప్రపంచవ్యాప్తంగా రేపు (సెప్టెంబర్ 24) 'ది ప్యారడైజ్' విడుదల కానుంది. ఇప్పటికే సెప్టెంబర్ 23 రాత్రి పలు నగరాల్లో ప్రత్యేక ప్రీమియర్ షోలు ప్రారంభమయ్యాయి. ఈ సినిమాపై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొని ఉన్నాయి.



## మనం పార్టీ ఎప్పుడు ప్రారంభిస్తున్నాం? ఎయిర్‌పోర్ట్‌లో ధనుశ్‌కు ఊహించని ప్రశ్న, నవ్వుతూ దాటేసిన హీరో!

కోలీవుడ్ టాలెంటెడ్ హీరో ధనుష్ స్వీయ దర్శకత్వంలో తెరకెక్కిన సంచలన చిత్రం 'రాయన్' కు ఉత్తమ తమిళ చిత్రంగా జాతీయ అవార్డు దక్కిన విషయం తెలిసిందే. ఈ వేడుకల అనంతరం చెన్నై ఎయిర్‌పోర్ట్‌లో పయణమవుతున్న సమయంలో మీడియా ప్రతినిధులు ఆయనను చుట్టుముట్టారు. ఈ సందర్భంగా అక్కడున్న ఒక మీడియా రిపోర్టర్ సరదాగా ధనుష్‌ను ఉద్దేశించి, (మనం రాజకీయ పార్టీ ఎప్పుడు ప్రారంభిస్తున్నాం?) అని ప్రశ్నించారు. సీఎం విజయ్ తర్వాత ధనుష్ కూడా పాలిటిక్స్‌లోకి ఎంట్రీ ఇవ్వబోతున్న వార్తల సందర్భంగా ఈ ప్రశ్నను రిపోర్టర్ అడిగారు. అయితే ఈ ఊహించని ప్రశ్నకు ధనుష్ ఎలాంటి సీరియస్ వ్యాఖ్యానాలు చేయకుండా, కేవలం చిరునవ్వు నవ్వుకుంటూ అక్కడి నుంచి సైలెంట్‌గా వెళ్లిపోయాడు ధనుష్. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది.

## అదరగొట్టేసిన రష్మిక మందన్నా.. టాక్ ఆఫ్ ది టౌన్‌గా మైసా టీజర్ వ్యూస్



కన్నడ భామ రష్మిక మందన్నా తొలిసారి యాక్షన్ అవతార్‌లో కనిపించబోతున్న ప్రాజెక్ట్ మైసా పాన్ ఇండియా బ్యాక్ డ్రాప్‌లో తెరకెక్కుతున్న ఈ మూవీ నుంచి ఇప్పటికే విడుదల చేసిన రష్మిక మందన్నా ఫస్ట్ లుక్ పోస్టర్ నెట్టింట వైరల్ అవ్వుతూ సినిమాపై అంచనాలు పెంచేస్తుందని తెలిసిందే. ఇక రెండు రోజుల క్రితం లాంచ్ చేసిన టీజర్ రష్మిక మందన్నాలోని మరో యాంగిల్‌ను చూడబోతున్నట్టు చెప్పేస్తుంది. డీగ్లామరైజ్‌డ్‌గా యాక్షన్ అవతార్‌లో గూస్‌బంప్స్ తెప్పించే యాక్టింగ్‌తో అదరగొట్టేస్తుంది. మైసా టీజర్‌కు అద్భుతమైన స్పందన వస్తోంది. టీజర్ లాంచ్ చేసిన కొన్ని గంటల్లోనే 25 మిలియన్లకుపైగా వ్యూస్‌తో ట్రెండింగ్‌లో నిలుస్తోంది. రష్మిక మందన్నా ఊహించని లుక్‌లో అదరగొట్టేస్తూ.. విజయశాంతిని గుర్తుకు తెస్తోందంటూ కామెంట్లు పెడుతున్నారు మూవీ లవర్స్. ఈ మూవీలో రష్మిక మందన్నా గోండ్ గిరిజన మహిళగా కనిపించనుందని టీజర్‌తో తెలిసిపోతుంది. మైసా సినిమాతో ఘుఃబఅఃతీఖ ౹ాబశ్రీశ్రీవ డైరెక్టర్‌గా ఎంట్రీ ఇస్తున్నాడు. అన్‌ఫార్ములా ఫిల్మ్స్ బ్యానర్‌పై తెరకెక్కుతున్న ఈ మూవీకి జేక్స్ బిజోయ్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ అందిస్తున్నాడు. ఈ మూవీలో పుష్ప 2 విలన్ తారక్ పొన్నప్ప కీలక పాత్రలో నటిస్తున్నాడు. డెబ్యూ డైరెక్టర్ ఎంట్రీతోనే బాక్సాఫీస్‌ను షేక్ చేయడం పక్కా అని విజువల్స్ చెప్పకనే చెబుతున్నాయి.

## రూ. 100 కోట్ల వసూళ్లు.. 'మండాడి' టీమ్‌పై కమల్ హాసన్ ప్రశంసలు!



ప్రముఖ నటుడు సూరి హీరోగా నటించిన తాజా చిత్రం 'మండాడి' ప్రపంచవ్యాప్తంగా రూ. 100 కోట్ల వసూళ్లను రాబట్టి ఘనవిజయం సాధించిన నేపథ్యంలో, లెజెండరీ నటుడు కమల్ హాసన్ ఈ చిత్ర బృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు. మత్స్యకారుల జీవితాలు మరియు సంప్రదాయ పడవ రేసుల (పాయ్ మార పడగు) నేపథ్యంలో మతిమారన్ పుగళేంది దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో సూరితో పాటు సుహాస్ కీలక పాత్రల్లో నటించారు. సెప్టెంబర్ 10న విడుదలైన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద అద్భుతమైన కలెక్షన్లతో దూసుకుపోతోంది. ఇప్పటివరకు ఈ చిత్రం రూ. 109.25 కోట్ల ప్రపంచవ్యాప్త వసూళ్లను సాధించింది. అయితే తాజాగా ఈ సినిమాను చూసిన కమల్ హాసన్ చిత్రబృందానికి కలుసుకుని సినిమాపై ప్రశంసల వర్షం కురిపించాడు. ఇక కమల్ హాసన్‌ను కలవడం తన జీవితంలో మరువలేని క్షణమని హీరో సూరి సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు. "డాక్టర్ కమల్ హాసన్ సర్, మీ నిస్వార్థమైన ప్రేమ, శక్తివంతమైన మాటలు, దీవెనలు మా మండాడి ప్రయాణాన్ని మరింత ప్రత్యేకంగా మార్చాయి" అంటూ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. దర్శకుడు మతిమారన్ పుగళేంది కూడా స్పందిస్తూ, సినిమా రంగంలో సీనియర్ విద్యార్థి, నిరంతరం స్ఫూర్తినిచ్చే కమల్ హాసన్‌ను కలవడం సంతోషంగా ఉందని, తమ చిత్రాన్ని అభినందించినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ చిత్రంలో ప్రతినాయక పాత్రలో నటించిన టాలీవుడ్ నటుడు సుహాస్ మాట్లాడుతూ, కొన్ని క్షణాలు మనల్ని నిశ్చేష్టులను చేస్తాయి. నట దిగ్గజం కమల్ హాసన్ సర్ పక్కన నిలబడటం నా కల సాకారమైన క్షణం అంటూ తన ఆనందాన్ని ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకున్నారు.

Printed, Published & Owned by JERIPOTHULA SAMPATH, Printed at SRI BALAJI, H.No. 4-4-85, Tilak road, District Karimnagar. 505 001 (T.S)Published at H.No. 3-6-307, Subhash Nagar, Karimnagar MDI: District, Karimnagar -505 001 (T.S) Editor: JERIPOTHULA SAMPATH, RNI NO. APTEL/2012/53127 CELL:9912758107, telanganavanil@gmail.com